

నాణ్యత తారుమారు

కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి విస్తరణ పనులు పెద్దఎత్తున సాగుతున్నాయి. నందికొట్కూరు ప్రాంతంలో ఇటీవల వర్షానికి కొత్తగా వేసిన రహదారి కుంగి గుంతలు పడటంతో తొలగించి మళ్లీ కొత్తగా నిర్మిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యత కరవవుతోందని పలువురు పేర్కొంటున్నారు. – ఈనాడు, కర్నూలు



సహాయకుల నిరీక్షణ

కర్నూలు సర్వజన ఆసుపత్రిలో మాతాశిశు విభాగం విభాగానికి వచ్చిన రోగుల సహాయకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ నిత్యం రెండు వందల వరకు ప్రసవాలు జరుగుతుంటాయి.. బాలింతల సహాయం నిమిత్తం కుటుంబీకులు వస్తుంటారు.. వారంతా ఆసుపత్రి బయట ఉండాల్సిందే.. వైద్య సిబ్బంది పిలిస్తేనే వార్డుల్లోకి వెళ్లాల్సి ఉంటుంది. మిగిలిన సమయమంతా ఆరుబయట నిరీక్షించాల్సిందే. ఇక వర్షం వచ్చిందే తడిసిపోవాల్సిందే. సౌకర్యాలు కల్పించాలని విన్నవిస్తున్నారు.

–ఈనాడు, కర్నూలు

పారిశ్రామికవాడలో ఉపాధి మేడలు

ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో 'ఉపాధి' మేడల నిర్మాణానికి పునాదులు పడుతున్నాయి. కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో రానున్న ఐదేళ్లలో రూ.10 వేల కోట్లతో పారిశ్రామికవాడలో మౌలిక వసతులు కల్పించేలా లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు. 9,936 ఎకరాలను పరిశ్రమలకు అనువుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారు. రూ.60 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేలా భారీ పరిశ్రమలను ఆహ్వానించేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో పాలకులు ముందుకెళ్తున్నారు. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు ఓర్వకల్లు పారిశ్రామిక వాడ కేంద్ర బిందువుగా మారనుందని అధికారులు పేర్కొంటున్నారు.

- ఓర్వకల్లులో చకచకా ఏర్పాట్లు
- 9,936 ఎకరాల్లో మౌలిక వసతులు
- భారీ పరిశ్రమల స్థాపనకు ప్రణాళిక



పంచవర్ష ప్రణాళిక

- 2025-27 కాల వ్యవధిలో కేంద్ర ప్రభుత్వ నిధులతో మొదటి దఫా 2,600 ఎకరాలు, అదే క్రమంలో 2,400 ఎకరాల్లో రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఐఐసీ కలిసి పారిశ్రామికవాడలను అభివృద్ధి చేయనున్నాయి. ఈ మూడింటి భాగస్వామ్యంతో 5,505 ఎకరాల్లో పారిశ్రామికవాడ వినియోగంలోకి రానుంది.
- 2027 నుంచి 2029 వరకు కేంద్రం ఎన్ఐసీడీసీ ద్వారా రెండో దఫా 2,456 ఎకరాల పారిశ్రామిక భూముల్లో వసతులు కల్పించనుంది. 1,975 ఎకరాలను ఏపీఐఐసీ అభివృద్ధి చేయనుంది.
- పారిశ్రామిక వాడ కోసం దూపాడు-బేతంచెర్ల వరకు 50 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ ఏర్పాటుకు సర్వే పనులు పూర్తయ్యాయి. త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

1 గుట్టపాడులో 413.19 ఎకరాల విస్తీర్ణంలో జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమ పనులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి కానున్నాయి. వచ్చే ఏడాది పరిశ్రమను ప్రారంభించేందుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పరిశ్రమకు 0.15 టీఎంసీ నీరు అవసరం కాగా.. ప్రస్తుతం ఆ పరిశ్రమ యాజమాన్యం 45 ఎకరాల్లో చెరువు తరహాలో రిజర్వాయర్ ఏర్పాటు చేసుకుంది. రూ.2,938 కోట్లతో చేపట్టిన స్టీల్ పరిశ్రమ వినియోగంలోకి వస్తే ప్రత్యక్షంగా 1,030 మందికి, పరోక్షంగా మరో 2 వేల మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు చెబుతున్నారు.

2 సిగాచి ఫార్మా బయోటెక్ కంపెనీకి 25.09 ఎకరాలు కేటాయించారు. రూ.285 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమను వచ్చే ఏడాది ప్రారంభించేందుకు పనులు ముమ్మరం చేశారు. అందుబాటులోకి వస్తే 850 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయి.

3 ఆర్‌పీఎస్ ఫార్మాను 12 ఎకరాల్లో నెలకొల్పనున్నారు. రూ.90 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటుకానున్న పరిశ్రమలో సుమారు 285 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి.

4 ప్రైమో పాలి ప్యాక్ (ప్లాస్టిక్) పరిశ్రమకు ఐదు ఎకరాలు కేటాయించారు. రూ.3.37 కోట్ల పెట్టుబడులతో చేపడుతున్న ఈ పరిశ్రమ 2025లో ప్రారంభం కానుంది. ఈ పరిశ్రమ అందుబాటులోకి వస్తే 95 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు రానున్నాయి.

పరిశ్రమల గుట్ట

★ ఓర్వకల్లు మండలం గుట్టపాడులో మైక్రో స్మాల్ ఎంటర్‌ప్రైనుర్స్ క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రాజెక్టు (ఎంఎస్‌సీడీపీ) ఏర్పాటు కానుంది. 219.38 ఎకరాల విస్తీర్ణంలో మౌలిక సదుపాయాలు, వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం 70 శాతం, ఏపీఐఐసీ 30 శాతం నిధులతో అభివృద్ధి చేయనున్నాయి.

★ రూ.19.10 కోట్లతో వసతులు కల్పించనున్నారు. రూ10.80 కోట్లతో 3.54 కిలోమీటర్ల మేర అప్రోచ్ రోడ్లు, 4.5 కిలోమీటర్ల మేర రహదారులు, డ్రైన్లు, కల్వర్టులను అభివృద్ధి చేయనున్నారు.

★ ఎంఎస్ఎంఈ తరహాలో ఉండే ఈ ప్రాజెక్టు పనులు పూర్తయితే 200 ప్లాట్లతో లేఅవుట్ వేయనున్నారు. ఫలితంగా రెండొందల వరకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు రానున్నాయి.

ముందుకొచ్చిన కేంద్రం

● ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ ప్రాజెక్టుకు 2014-19లో అప్పటి తెదేపా ప్రభుత్వం పునాది వేసింది. హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారిని ఆనుకుని పది వేల ఎకరాల్లో తీర్చిదిద్దాలని ప్రణాళికలు రూపొందించారు. 9,936 ఎకరాలు సేకరించి ఏపీఐఐసీకి బదలాయించింది. పరిశ్రమల ఏర్పాటుకు కొన్ని సంస్థలు ముందుకొచ్చాయి.

● ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ఐదేళ్లలో ఒక్క పరిశ్రమను తీసుకురాలేదు. స్థానికంగా ఉపాధిలేక యువత వలస బాట పట్టారు.

● సమస్యను గమనించిన 'కూటమి' ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో పారిశ్రామికవాడ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేందుకు ముందుకొచ్చింది.

● ఓర్వకల్లు పారిశ్రామికవాడకు రూ.2,500 కోట్లను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నేపథ్యంలో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) ఆధ్వర్యంలో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. మొదటిదఫా ఉప్పలపాడు, మీదివేముల, ఎన్.కొంతలపాడు గ్రామాల పరిధిలో 2,600 ఎకరాలు కేటాయించారు. రానున్న రెండేళ్లలో మొదటి దశ పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయి.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :



అధినేత దిశానిర్దేశం

ఎన్నికల్లో ఇచ్చినమాట ప్రకారం సంక్షేమం.. అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌ఛార్జులు, ముఖ్య నేతలతో సీఎం శుక్రవారం సమావేశమయ్యారు. తెదేపా సభ్యత్వ నమోదును సమర్థంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వర రెడ్డి, కేఈ శ్యాంబాబు, ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే:

భూ సమస్యల వెల్లువ

- మొదటి రోజు 997 దరఖాస్తులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రీసర్వే పూర్తైన గ్రామాల్లో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రెవెన్యూ గ్రామసభలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 26 మండలాల్లో 26 గ్రామసభలు నిర్వహించారు. జేసీ డా.బి.నవ్య, సర్వే ఏడీ మునికన్నన్‌లు ఓర్వకల్లు మండలం తిప్పాయపల్లెలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. మొదటి రోజు 997 అర్జీలు వచ్చాయి. రోజువారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, భూసమస్యలు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జేసీ డా.బి.నవ్య ఆదేశించారు.

రౌడీలను పంపి మూయించారు

తెదేపా కర్నూలు నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ కుమారుడికి కర్నూలు మండల పరిధిలో మద్యం దుకాణం అనుమతి దక్కింది. కర్నూలు మండలం వెంకాయపల్లె పరిధిలో సిటీ వైన్స్ పేరుతో గురువారం దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. కోడుమూరు నియోజకవర్గ తెదేపా సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి 30 మంది రౌడీలను పంపి దుకాణాన్ని బలవంతంగా మూయించారని.. వారి దౌర్జన్యంపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తానని నాగరాజు యాదవ్ శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మరీ ఆరోపించారు. విష్ణువర్ధన్‌రెడ్డిపై పార్టీ పరంగానూ చర్యలు తీసుకోవాలని విన్నవించడం గమనార్హం.



దుకాణానికి తాళాలు వేయటంతో బయటే ఉన్న దుకాణ నిర్వాహకులు

మద్యంపై ఖద్దరు దౌర్జన్యం

- నిర్వాహకులకు నేతల బెదిరింపులు
- వాటాలు ఇవ్వకుంటే తాళాలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : మద్యం దుకాణాల ఏర్పాటులో ఖద్దరు దౌర్జన్యం మితిమీరింది. వాటాలు ఇవ్వకుంటే దుకాణాలు పెట్టనీయడం లేదు. ఒకవేళ ఏర్పాటుచేసినా దౌర్జన్యాలకు దిగుతున్నారు. కర్నూలు ఆబ్కారీ స్టేషన్ పరిధిలో ఇప్పటికీ ఆరు మద్యం దుకాణాలు తెరుచుకోలేదు. మొత్తం 31 మద్యం దుకాణాలకు అనుమతులు జారీ చేశారు. ఈనెల 16 నుంచి దుకాణాలు నిర్వహించుకోవాల్సి ఉంది. శుక్రవారం నాటికి 25 దుకాణాలు మాత్రమే తెరుచుకోగా మరో ఆరు దుకాణాలు ఏర్పాటు కాలేదు. పలువురికి దుకాణాలు దొరక్కపోగా రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో మరో ముగ్గురు ఏర్పాటు చేయలేని పరిస్థితి. సదరు అనుమతిదారులు ఎక్కడున్నారో తెలియదని ఆబ్కారీ శాఖ అధికారులు పేర్కొంటుండటం గమనార్హం. కర్నూలు మండల పరిధిలో అనుమతులు దక్కించుకున్న మరో ఇద్దరు దుకాణాలు ఏర్పాటుచేయలేని పరిస్థితి నెలకొంది.

☛ కర్నూలు మండల పరిధిలో అనుమతి దక్కించుకున్న ఓ యువకుడు దుకాణం ఏర్పాటు చేసుకోలేక కోడుమూరు నేతకు అప్పగించినట్లు తెలిసింది. ఇటు పోలీసు అధికారులు, ఆబ్కారీ శాఖ అధికారులు, పార్టీ నాయకులు జోక్యం చేసుకునే సాహసం చేయలేకపోతున్నట్లు తెలిసింది.

☛ అనవసర విషయాల్లో జోక్యం చేసుకుని పార్టీ పరువు తీయొద్దని ముఖ్యమంత్రి, తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేలు, నాయకులకు హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవటం గమనార్హం.

భాగస్వామ్యం ఇవ్వాల్సిందే

☛ కర్నూలులో మద్యం దుకాణ అనుమతి దక్కించుకున్న బైరెడ్డి వర్గీయులు కల్లూరు చెన్నమ్మ కూడలి సమీపంలో పెట్రోలు బంకు వద్ద దుకాణం ఏర్పాటు చేసుకుంటుండగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కోర్టు విచారణలో ఉన్న సదరు స్థలంలో ఎలా ఏర్పాటు చేస్తారంటూ ఆయన అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

☛ కోడుమూరు పరిధిలో రెండు అనుమతులు దక్కించుకున్న తెలంగాణ మహిళ ఓ తెదేపా నేత నుంచి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. రెండు దుకాణాల్లో భాగస్వామ్యం ఇవ్వాలని హుకుం జారీ చేయటంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

☛ హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారికి కోడుమూరు పరిధిలో మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతి దక్కింది. ఓ నేత దుకాణం ఏర్పాటుచేయనీయకపోవడంతో విజయవాడలో పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు.

లెక్కుంది.. మొక్క లేదు

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: లెక్క రూ.కోట్లల్లో ఉంది.. నాటిన మొక్క మాయమైంది. ప్రజాధనం 'చెట్లపాలైంది'. మొక్కలు నాటుతూ సంబరాలు చేశారు. వాటి సంరక్షణ మాత్రం గాలికొదిలేశారు. జిల్లాలో గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన జగనన్న పచ్చతోరణం గుత్తేదారులకు, అధికారులకు కాసులు కురిపించింది తప్ప ముచ్చుకైనా ఒక్క మొక్క చెట్టులా మారిన దాఖలాలు లేవు. 2020-21, 2021-22, 2022-23 వరకు మూడేళ్ల పాటు లక్షల సంఖ్యలో మొక్కలు నాటినా.. లక్ష్యం మాత్రం నెరవేరలేదు.. రూ.కోట్లతో జేబులు నింపుకొన్నారు.

కొరవడిన సంరక్షణ

జిల్లాలో గత వైకాపా ప్రభుత్వం జగనన్న పచ్చతోరణం పథకం పేరుతో చెట్ల పెంపకానికి తెరపైకి తెచ్చింది. అటవీశాఖ, జిల్లా నీటియాజమాన్య సంస్థ(డ్వామా) ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఇందులో చాలా వరకు వైకాపా నాయకులే గుత్తేదారులుగా మారి, మొక్కలు నాటకుండానే.. లెక్కలు మేసేశారు. మొక్కల కొనుగోలు, ట్రీ గార్డులు, వాటి సంరక్షణకు ఏటా సుమారు రూ.3 కోట్లు ఖర్చు చేశారు.




ఆలూరు-కరిగుడ్డం రహదారికి ఇరువైపులా 8 కి.మీ. మేర మొక్కలు నాటారు. ప్రస్తుతం మచ్చుకైనా ఒక్కటీ కనిపించడంలేదు.

ఆర్టీసీకి దసరా ఆదాయం

కర్నూలు బి.క్యాంపు, నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఆర్టీసీ అధికారులు ప్రయాణికులపై ఎలాంటి అదనపు భారం విధించలేదు.. ప్రణాళికతో పండక్కి బస్సులు నడిపించారు. 'దసరా'కు రూ.10.9 లక్షల అదనపు ఆదాయానికి రాబట్టుకోగలిగారు.. కర్నూలు జిల్లా పరిధిలో గతేడాది రూ.7 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ.7.2 లక్షలు, నంద్యాల జిల్లాలో గతేడాది రూ.3.6 లక్షలు ప్రస్తుతం రూ.3.7 లక్షల ఆదాయం వచ్చింది. దసరా నేపథ్యంలో అక్టోబరు 5 నుంచి 11 వరకు, 13 నుంచి 16 వరకు బస్సులు నడిపారు. హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, విజయవాడ, చెన్నై వంటి ప్రాంతాలకు 343 సర్వీసులను తిప్పారు. "ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు నడిపించాం.. గతేడాదితో పోలిస్తే స్వల్ప ఆదాయం పెరిగిందని" ఉమ్మడి జిల్లాల ప్రజారవాణాధికారులు శ్రీనివాసులు, రజియా సుల్తానాలు పేర్కొన్నారు.

డిపో	బస్సు సర్వీసులు	ఆదాయం (రూ.వేలల్లో)
ఆదోని	45	12.07
కర్నూలు-1	111	31.46
కర్నూలు-2	77	20.67
ఎమ్మిగనూరు	25	73.78
ఆళ్లగడ్డ	23	51.23
ఆత్మకూరు	15	35.90
బనగానపల్లి	14	35.89
డోన్	14	29.13
కోవెలకుంట్ల	23	53.43
నందికొట్కూరు	05	16.19
నంద్యాల	58	14.93

ఆలయ దస్త్రం గల్లంతు

ఈనాడు, కర్నూలు : దేవాదాయ శాఖకు రావాల్సిన నిధులు పక్కదారి పడుతున్నా ఆ శాఖ ఉన్నతాధికారుల్లో చలనం కరవైంది. అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించకుండా వారికే కొమ్ముకాస్తున్నారు. ఓర్వకల్లు మండలం బుగ్గరామేశ్వరస్వామి ఆలయ ఈవో డి.ఆర్.కె.ప్రసాద్ రూ.1.30 కోట్ల విలువైన ఆలయ ఎఫ్.డి. (ఫిక్స్‌డ్ డిపాజిట్లు) స్వాహా చేసిన విషయం వెలుగులోకి వచ్చి 20 రోజుల తర్వాత చర్యలు తీసుకున్నారు. బుగ్గరామేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి భూముల్లో గ్రీన్‌కో సంస్థ మూడు విద్యుత్తు టవర్లు ఏర్పాటు చేసింది.



ఇందుకు సంబంధించిన నిర్ణీత రుసుములు చెల్లించింది. ఆయా వివరాలున్న దస్త్రాన్ని మాయం చేశారు. గ్రీన్‌కో సంస్థ ఎంత భూమి తీసుకుంది ? దేవాదాయ శాఖకు ఎంత చెల్లించింది ? ఆయా రుసుములు దేవస్థానం అధికారిక ఖాతాకు జమయ్యాయా ? లేదా ? అనే విషయాలు తెలుసుకోవడం ప్రశ్నార్థకంగా మారింది. గ్రీన్‌కో చెల్లించిన రుసుములు పక్కదారి పట్టించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతోపాటు మరో సంస్థ కూడా దేవస్థానం భూముల్లో టవర్లు ఏర్పాటు చేసినట్లు అధికారుల దృష్టికి రావడంతో విచారణ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. దేవాదాయ శాఖకు 43,455 ఎకరాలు ఉండగా.. అందులో కేవలం 7,029 ఎకరాలు కౌలుకు ఇచ్చారు. 36,426 ఎకరాలు ఆక్రమణదారుల చెరలో చిక్కుకున్నాయి. కొందరు ఆలయ భూములను ఆక్రమించుకుని వాటిని ఎవరూ కౌలుకు తీసుకోకుండా అడ్డుపడుతున్నారు. ఫలితంగా దేవాదాయ శాఖ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

అనర్హుల ఆరాటం..

- అధిక పింఛన్‌పై ఆశ
- సదరమ్‌కు వస్తోంది అనర్హులే అధికం


అర్హులకు ఆటంకం

నంద్యాలకు చెందిన మునీర్ బాషా (30)కు 20 ఏళ్ల కిందట తలకు శస్త్రచికిత్స జరిగింది. 'న్యూరో' సంబంధిత సమస్య ఉందంటూ సదరమ్ ధ్రువీకరణ పత్రం కోసం పేరు నమోదు చేసుకొన్నారు. 18వ తేదీకి ఆదోనిలో స్లాట్ నమోదైంది. అక్కడికెళ్లకుండా కర్నూలు వైద్యశాలకు వచ్చారు. గమనించిన వైద్యులు తిప్పి పంపించారు.

రాష్ట్రంలో 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివ్యాంగులను పింఛన్‌ను మొత్తాన్ని పెంచింది. న్యూరో, పక్షవాతంతో మంచానికే పరిమితమైనవారు.. నడవలేని వారికి నెలకు రూ.15 వేలు చెల్లిస్తున్నారు. సదరమ్ ధ్రువీకరణ పత్రం ఉంటేనే అర్హులు.. దొడ్డిదారిన పించను తీసుకొనేందుకుగాను తమ పలుకుబడి ఉపయోగించుకుని ధ్రువీకరణ పత్రం తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సదరమ్ స్లాట్‌ల కోసం అనర్హులు పెద్దఎత్తున నమోదు చేసుకుంటున్నారు. దీంతో అర్హులకు స్లాట్‌లు దొరకని పరిస్థితి నెలకొంది.

–కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే :

పక్షవాతంతో కాలు చేయి పడిపోయినవారు, ప్రమాదాల కారణంగా శరీర భాగాలు పని చేయనివారు.. పుట్టుకతో మూగ, చెవుడు ఉండటం. . మానసిక వికలాంగులు, పోలియో బాధితులు తదితరులు సదరమ్ ధ్రువీకరణ పత్రం కోసం మీ సేవలో వివరాలు నమోదు చేసుకోవాలి. ఎక్కడ ఖాళీగా ఉంటే ఆ ప్రాంతంలో మంగళ, శుక్రవారాల్లో నిర్వహించే సదరమ్ శిబిరాలకు హాజరు కావాల్సి ఉంటుంది. కనీసం 40 శాతం అంగవైకల్యం ఉంటేనే వైద్యులు ధ్రువీకరించి ధ్రువపత్రం అందజేస్తారు.



ప్రాథమిక స్థాయిలో అడ్డుకుంటేనే..

పక్షవాతం, న్యూరో తదితర సమస్యలు ఉన్నవారిని ఆ పరిధిలోని సీహెచ్‌సీ వైద్యుడు గుర్తించి వారిని మాత్రమే సదరమ్ ధ్రువీకరణ పత్రానికి సంబంధించి స్లాట్ బుక్ చేసుకొనేలా చర్యలు తీసుకోవాలి. ఫలితంగా అక్కడికక్కడే అనర్హులను ప్రాథమికంగానే నియంత్రించేందుకు వీలుంటుంది. ఫలితంగా ఆయా పీహెచ్‌సీల పరిధిలోనే అర్హులు, అనర్హులను గుర్తించడం ద్వారా సదరమ్ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. బాధితులు దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బంది లేకుండా.. ఏ ప్రాంతం వారు.. ఆ ప్రాంతంలోనే వైద్య పరీక్షలు చేయించుకునే వీలుంటుంది.

వైద్యులకు 'పరీక్ష'

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతి నెలా వేల సంఖ్యలో అనర్హులు సదరమ్ స్లాట్‌లు నమోదు చేసుకుంటున్నారు. వారి కారణంగా అర్హులైన వారికి స్లాట్‌లు దొరకడం లేదు. మరికొందరికి దొరికినా సుదూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లాల్సి రావడంతో నరక యాతన అనుభవిస్తున్నారు. నిరుపేదలు ఛార్జీల రూపంలో పెద్దఎత్తున ఖర్చు చేయాల్సిన పరిస్థితి. మరికొందరు చిన్నపాటి సమస్యలతోనూ సదరమ్ పత్రం కోసం దరఖాస్తు చేసుకొంటుండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి. కర్నూలు సర్వజన ఆస్పత్రికి శుక్రవారం 40 మంది స్లాట్‌ల కోసం నమోదు చేసుకున్నారు. వీరిలో కేవలం 17 మంది మాత్రమే హాజరయ్యారు. వైద్యులు వీరిని పరిశీలించగా ఇద్దరు మాత్రమే అర్హులుగా తేల్చారు.

టెట్‌కు 2,665 మంది హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 349 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 1,507 మందికి గాను 1,319 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 1,507 మందికి గాను 1,346 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు.

వేరుసెనగ.. రూ.5,920

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.5,920, మధ్యస్థం రూ.5,089, కనిష్ఠం రూ.1,820కు వ్యాపారులు కొన్నారు. మార్కెట్‌కు రైతులు 2,122 వేరుసెనగ సంచులను అమ్మకానికి తీసుకొచ్చారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే : జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరుగా బి.బాలచంద్రారెడ్డి శుక్రవారం కర్నూలులోని జలమండలి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కర్నూలు ఎంఐ ఈఈ శ్రీనివాసులు, ఆర్డీఎస్ ఈఈ భాస్కరరెడ్డి, డీఈఈలు రామకృష్ణ, రఘురామిరెడ్డి, నాగరాజు తదితరులు అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఈ బాలచంద్రారెడ్డి

అనంతరం ఆయన కలెక్టర్ రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు.

☛ చెరువులు, కేసీ, ఎల్లెల్సీ పరిధిలో సాగునీటికి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జలవనరుల శాఖ కర్నూలు సీఈ కబీర్ బాషా కోరారు. కర్నూలు ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన బాలచంద్రారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా సీఈని కలిశారు.

ఒక్కగేటు ద్వారా నీరు విడుదల

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో అధికారులు శుక్రవారం ఒక్క రేడియల్ క్రస్టు గేటు ఎత్తారు. 10 అడుగుల మేర పైకి ఎత్తి 27,891 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 67,862 క్యూసెక్కులను అదనంగా నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఈ సీజన్‌లో రేడియల్ క్రస్టుగేట్లను ఎత్తడం ఇది ఐదోసారి.

పల్లె క్రీడాకారులు..

◆ ఖోఖో, ఫుట్‌బాల్ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులు

పతకాల సాధకులు



కోసిగి, న్యూస్‌టుడే: గ్రామీణ విద్యార్థులు వివిధ క్రీడల్లో విజయాలు సాధిస్తూ పతకాలు సొంతం చేసుకుంటున్నారు. కోసిగి మండలం వందగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఖోఖో, ఫుట్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. ఇక్కడి జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు లేకపోయినా అదే గ్రామానికి చెందిన ధర్మరాజు అనే యువకుడి వద్ద శిక్షణ పొందుతూ మెలకువలు నేర్చుకుంటూ సత్తా చాటుతున్నారు.

రాష్ట్ర స్థాయిలో పతకం సాధించా: మౌనేశ్



నేను తిరుపతిలో శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. మా అమ్మానాన్నలు వ్యవసాయ కూలీ పనులు చేస్తారు. 6వ తరగతి చదువుతున్నప్పటి నుంచి ఖోఖో క్రీడపై ఆసక్తి పెంచుకున్నా. 2020లో శ్రీకాకుళంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో పతకం సాధించా. 2021లో విశాఖపట్నంలో అండర్-14 విభాగం ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రన్నర్‌గా నిలిచి కప్ అందుకున్నా. 2023లో తూర్పుగోదావరిలో నిర్వహించిన అండర్-17 రాష్ట్ర పోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చా. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రాష్ట్ర పోటీల్లో ప్రత్యేక ఆటతీరుతో పతకం అందుకున్నా.

క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యం: రమేశ్



నేను వైఎస్సార్ జిల్లా రాయచోటిలో టీటీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాను. మా అమ్మానాన్నలు వ్యవసాయం చేస్తారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సొంతూరు వందగల్లులోనే చదివాను. నాకు చిన్నతనం నుంచి ఖోఖో క్రీడంటే ఎంతో ఆసక్తి. 2022లో ఆత్మకూరులో నిర్వహించిన అండర్-18 విభాగంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో తృతీయ బహుమతి సాధించాను. విజయనగరంలో జరిగిన అండర్-19 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచా. 2023లో చిత్తూరులో అండర్-18 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో మెరుగైన ప్రదర్శన ఇవ్వడంతో జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆళగడ్డలో రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో జరిగిన జాతీయ పోటీల్లో పతకం సాధించాను. తిరుపతిలో నిర్వహించిన ఏపీ సీఎం కప్ రాష్ట్ర పోటీల్లో పతకాలు అందుకున్నాను. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.

జాతీయ ఫుట్‌బాల్‌లో గోల్ చేశా: సుప్రియ



నేను కడప స్పోర్ట్స్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నా. మా నాన్న సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు వందగల్లు గ్రామంలోనే చదివాను. 6వ తరగతిలో వైఎస్సార్ జిల్లా స్పోర్ట్స్ పాఠశాలలో సీటు రావడంతో అక్కడే విద్యాభ్యాసం చేస్తున్నాను. నాకు చిన్నతనం నుంచి ఫుట్‌బాల్ ఆటంటే ఎంతో ఆసక్తి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో ఫుట్‌బాల్ నేర్చుకున్నా. 2023లో ఝార్ఖండ్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జాతీయ పోటీల్లో పాల్గొని గోల్ చేశాను. 2024లో మధ్యప్రదేశ్‌లో జరిగిన సబ్ జూనియర్ జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని గోల్ చేసి పతకం సాధించాను. క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదిగి ఉద్యోగం సాధించాలన్నది నా ఆశయం.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లేకుంటే చర్యలు



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, పక్కన జేసీ డా.బి.నవ్య తదితరులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి చూపకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా వివిధ అంశాలపై ప్రత్యేకాధికారులు, డివిజన్, మండలస్థాయి అధికారులతో శుక్రవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వంద రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాల సాధనలో భాగంగా గూడూరు మండలానికి 14 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా నెలలో కేవలం ఒక్కటి మాత్రమే పూర్తి చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. 8 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కలిసి ఒక్క ఇల్లు పూర్తి చేసేలా చూడటమేమిటని ప్రశ్నించారు. హాలహర్వి మండలంలో 116 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా నెలలో కేవలం ఒకటి మాత్రమే పూర్తి చేశారని.. ఆయా మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు తాఖీదులు జారీ చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో రాష్ట్రంలో కర్నూలు జిల్లా 26వ స్థానంలో ఉందని చెప్పారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో భాగంగా 4,311 ఎకరాల లక్ష్యాలకుగాను 3,400 ఎకరాలు పూర్తి చేశారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 4,658 అర్జీలు వచ్చాయని.. అందులో 3,427 పరిష్కరించగా.. 122 గడువు దాటిన అర్జీలు ఉన్నాయన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



సూచనలు ఇస్తున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : గ్రామాభివృద్ధిలో పంచాయతీల పాలకవర్గ సభ్యులు భాగస్వాములవ్వాలని.. అప్పుడే అన్ని రంగాల్లో ప్రగతి సాధ్యమని జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి అన్నారు. జిల్లాలోని 25 మండల పరిషత్ కార్యాలయాల్లో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. కర్నూలు జడ్పీ ఆవరణలోని కర్నూలు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణకు ఆయన హాజరై మాట్లాడారు. పంచాయతీలకు కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులతో పాటు సొంతంగా ఆదాయ వనరులు సమకూర్చుకోవాలని చెప్పారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచి నీరు, వీధి దీపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. కర్నూలు ఎంపీడీవో రఘునాథ్ మాట్లాడారు.

తెదేపా నేత మద్యం దుకాణాన్ని మూసివేయించారు

◆ పార్టీ వారికే రక్షణ లేకుండా పోయింది

◆ తెదేపా నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: తెదేపా నాయకులు, కార్యకర్తలు కలిసి రూ.80 లక్షలతో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోగా కర్నూలు రూరల్ మండల పరిధిలో ఒక మద్యం దుకాణం లక్కీడిప్‌లో వచ్చిందని తెదేపా నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ తెలిపారు. ఆ ప్రాంతంలో దుకాణం ఏర్పాటు చేయనీయకుండా తెదేపా నేత విష్ణువర్ధన్‌రెడ్డి తమను బెదిరింపులకు గురి చేశారని ఆరోపించారు. ఆయనతో పాటు గూడూరు మండల తెదేపా కన్వీనర్ ఎల్.సుధాకర్‌రెడ్డి, ఇతర నాయకులు శుక్రవారం కర్నూలులో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. నాగరాజు యాదవ్ మాట్లాడుతూ లక్కీడిప్‌లో వచ్చిన ఆ దుకాణాన్ని కర్నూలు రూరల్ మండలంలోని వెంకాయపల్లె వెళ్లే దారిలో గురువారం ప్రారంభించామని చెప్పారు. కోడుమూరు నియోజకవర్గ తెదేపా సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి 30 మంది రౌడీలను పంపి శుక్రవారం మధ్యాహ్నం దుకాణాన్ని దౌర్జన్యంగా మూసివేయించారన్నారు. ప్రజాప్రతినిధులు, తెదేపా నేతలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించిన రెండు గంటల్లోనే ఇలాంటి దుకాణం మూయించారని ఆవేదన వ్యక్తం చేశారు. విష్ణువర్ధన్‌రెడ్డి దౌర్జన్యాలపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించాలని, తెదేపా నాయకులు, కార్యకర్తలపై.. ఇలా బెదిరింపు ధోరణులు అవలంబించడం తగదన్నారు. పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రికి, మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. తెదేపా గూడూరు మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాము తెదేపాలో ఉన్నా రక్షణ లేకుండా పోయిందని చెప్పారు. తెదేపా వర్గీయులం 40 మంది కలిసి రూ.80 లక్షలు వెచ్చించి దరఖాస్తు చేసుకోగా లక్కీడిప్‌లో సుభాష్ పేరున 21వ దుకాణం వచ్చిన్నారు. ఆ ఒక్క దుకాణాన్ని కర్నూలు రూరల్ మండలంలో ప్రారంభించనీయకుండా విష్ణువర్ధన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని వాపోయారు. కర్నూలు రూరల్ మండలంలో నాలుగు దుకాణాలు లక్కీడిప్‌లో రాగా జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన ఒక వ్యక్తి దుకాణాన్ని ప్రారంభించనీయకుండా విష్ణు బెదిరింపులకు పాల్పడ్డారని అన్నారు.



మాట్లాడుతున్న తెదేపా నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్

దారంతా గుంతలు.. అడ్డంగా తవ్వకాలు



కౌతాళం మండలంలోని హాల్వి గ్రామంలో పెట్రోల్ బంకు నుంచి గుడికంబాలి క్రాస్ రోడ్డు వరకు అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతోపాటు పైపులైన్ ఏర్పాటుకు రహదారికి అడ్డంగా 8 చోట్ల తవ్వకాలు చేపట్టి, ఆ గుంతలను పూడ్చకుండా వదిలేశారు. దీంతో 300 మీటర్ల రహదారిలో ప్రయాణించాలంటే వణికిపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కౌతాళం

పత్తి మిల్లుల్లో విజిలెన్సు బృందం తనిఖీలు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: పట్టణంలోని పత్తి జిన్నింగ్ మిల్లులు, పత్తి దుకాణాలను శుక్రవారం ఏడీఎం నారాయణమూర్తి ఆధ్వర్యంలో మార్కెట్ శాఖ విజిలెన్స్ బృందం తనిఖీలు నిర్వహించింది. రెండు జిన్నింగ్ మిల్లుల్లో దస్త్రాలు, రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తి నిల్వలు తనిఖీ చేశారు. విజిలెన్స్ బృందం రాకతో చాలా మంది పత్తి వ్యాపారులు దుకాణాలు మూత వేసి వెళ్లారు. రాయలసీమ–తెలంగాణ సరిహద్దులోని నాగలదిన్నె చెక్‌పోస్టులో దస్త్రాలను తనిఖీ చేశారు. ఏడీఎం నారాయణమూర్తి మాట్లాడుతూ.. పత్తి కొనుగోలు పారదర్శకంగా జరిగేందుకు తనిఖీలు నిర్వహించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పత్తి కొనుగోలు చేసే వ్యాపారులకు తాఖీదులు అందజేస్తామన్నారు. తనిఖీలో మార్కెట్ శాఖ విజిలెన్స్ బృందం సభ్యులు మోహన్‌రెడ్డి, కేశవరెడ్డి, శివన్న పాల్గొన్నారు.



నాగలదిన్నె చెక్‌పోస్టులో దస్త్రాలు తనిఖీ చేస్తున్న మార్కెట్ శాఖ విజిలెన్స్ బృందం

ఏపీఈఆర్‌సీ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు (వెంకటరమణ కాలనీ), న్యూస్‌టుడే : కర్నూలు దిన్నెదేవరపాడు సమీపంలోని ఏపీఈఆర్‌సీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించినట్లు ఏపీఈఆర్‌సీ అధికారులు తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్ డిస్కంల పరిధిలో మొత్తం 12 మంది వినియోగదారులు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొని ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ సి.వి.నాగార్జునరెడ్డికి తమ అభిప్రాయాలను తెలిపేందుకు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో కొందరు తమ అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా ఇచ్చారని.. మరికొందరు నేరుగా మాట్లాడేలా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో వినియోగదారులు వర్చువల్‌గా పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపినట్లు అధికారులు తెలిపారు. వీటిని పరిశీలించి ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పీపీసీఏ) ఛార్జీలపై కమిషన్ తుది నిర్ణయం తీసుకోనుందని పేర్కొన్నారు.

విద్యా సమాచారం

49 పోస్టులకు 1,953 దరఖాస్తులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జిల్లా పరిధిలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది. వివిధ సబ్జెక్టుల్లో 49 ఖాళీలు ఉండగా 1,953 మంది మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు జీసీడీవో స్నేహ తెలిపారు. మొదటి రోజు శుక్రవారం పత్రాల పరిశీలనకు 24 మంది అభ్యర్థులు హాజరైనట్లు చెప్పారు. 19వ తేదీ కూడా పత్రాల పరిశీలన ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కలెక్టరేట్‌లోని సమగ్రశిక్ష కార్యాలయంలో జరుగుతున్న పత్రాల పరిశీలనకు హాజరు కావాలన్నారు.

గడువు పొడిగింపు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: సార్వత్రిక విద్యలో భాగంగా పది, ఇంటర్ చదవాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో శామ్యూల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ వరకు దరఖాస్తు సమయం పొడిగించినట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు www.ap.opens-chool.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

30లోగా దరఖాస్తు చేసుకోండి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : జిల్లావ్యాప్తంగా పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుకుంటున్న నూతన, రెన్యువల్ విద్యార్థులు ఆ కళాశాల జ్ఞానభూమి పోర్టల్‌లో 30వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. http//janabhumiv2.apcfss.in పోర్టల్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొన్నారు.

నవంబరు 10 నుంచి అగ్నివీర్ ఆర్మీ నియామక ర్యాలీ

రాయచోటి, న్యూస్‌టుడే: వైఎస్సార్ జిల్లా కడప డీఎస్ఏ స్టేడియంలో నవంబరు 10 నుంచి అగ్నివీర్ ఆర్మీ నియామక ర్యాలీ నిర్వహిస్తున్నామని ఆర్మీ నియామక అధికారి కల్నల్ పునీత్‌కుమార్ పేర్కొన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు, స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మెన్ నియామకానికి దరఖాస్తులు చేసి అడ్మిట్ కార్డులు పొందిన కర్నూలు, నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, నంద్యాల, బాపట్ల, పల్నాడు, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో అర్హులైన అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని ఎవరు దళారులను నమ్మి మోసపోకూడదని వివరించారు.

షికార్లు కొడుతూ దోచేస్తారు

☛ ముగ్గురు ఘరానా దొంగల గుట్టురట్టు

☛ ఒకరి అరెస్టు.. సొత్తు రికవరీ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కార్లలో షికార్లు కొడుతూ ఇళ్లకు కన్నాలేసి దోచుకునే ముగ్గురు దొంగల ముఠా గుట్టు రట్టైంది. ముగ్గురిలో ఒకరైన కర్నూలులోని ఫారూక్ నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్‌రహమాన్ అలియాస్ అల్తాఫ్ (24)ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్.. సీఐలు మురళీధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్‌తో కలిసి శుక్రవారం నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. నంద్యాలకు చెందిన మహేష్, బాలకృష్ణలు స్వయానా బావబావమరుదులు. బతుకుదెరువు కోసం కర్నూలుకు మకాం మార్చారు. మొదట బాలకృష్ణ తెలంగాణ రాష్ట్రానికి చెందిన దొంగలతో స్నేహం ఏర్పడి దొంగగా మారాడు. వారితో కలిసి పలు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డాడు. గతంలో కర్నూలు రెండో పట్టణ పోలీసులకు చిక్కిన బాలకృష్ణ తెలివిగా తప్పించుకున్నాడు. ఆ తర్వాత అతడి జల్సా జీవితాన్ని చూసిన మహేష్ సైతం దొంగగా మారాడు. ఇద్దరూ కలిసి మొదట బైకులో షికార్లు కొడుతూ తాళం వేసిన ఇళ్లను దోచేవారు. తమ ఇళ్లలో సెంట్రల్ ఏసీ ఏర్పాటు చేసుకుని కార్లలో తిరిగే స్థాయికి ఎదిగారు. వీరి ఇంటి సమీపంలో ఉంటున్న రౌడీషీటర్ షేక్ అబ్దుల్ రహమాన్ పరిచయం కాగా.. జత చేసుకున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రం, పుదిచ్చేరి వరకు నేరాలకు పాల్పడినట్లు తెలిసింది. ఆరు నెలల కిందట మహేష్ కర్నూలులో ఓ ఇంట్లో చోరీకి పాల్పడి వెళ్తుండగా కర్నూలు నాలుగో పట్టణ పోలీసులకు పట్టుబడ్డాడు. అతని కుటుంబ పెద్దలు పోలీసులకు నచ్చజెప్పి విడిపించుకుని పోయారు. ఈ విషయంలో కొందరు పోలీసులపై పలు ఆరోపణలు వచ్చాయి. వదిలిపెట్టే క్రమంలో పోలీసులు అతడి ఆనవాళ్లు తీసుకుని భద్రపరుచుకున్నారు. పోలీసుల చెర నుంచి తప్పించుకున్న మహేష్ తన బావమరిది, షేక్ అబ్దుల్ రహమాన్‌తో కలిసి వరుసగా ఇళ్ల దొంగతనాలకు పాల్పడ్డారు. కర్నూలు, నంద్యాల ప్రాంతాల్లో చోరీ జరిగిన ఘటనాస్థలంలో లభించిన ఆధారాలు ఒకేలా ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. దొంగల కోసం వెతికే క్రమంలో గతంలో కర్నూలు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో సేకరించుకున్న మహేష్ ఆధారాలతో పోల్చటంతో వీరి చోరీల బండారం బయటపడింది. షేక్ అబ్దుల్ రహిమాన్‌ను విచారించగా రెండేళ్లలో మొత్తం 36 చోరీలకు పాల్పడినట్లు నేరాలు అంగీకరించాడు. హైదరాబాద్‌లోని ఓ సంస్థలో 26 తులాలు విక్రయించినట్లు చెప్పాడు. మొత్తం 43 తులాల బంగారు ఆభరణాలు, 279.7 తులాల వెండి రికవరీ చేశారు. ప్రధాన నిందితులైన మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. దొంగలను పట్టుకున్న పోలీసులను ఎస్పీ జి.బిందుమాధవ్ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబూప్రసాద్

ప్రేమ వేధింపులతో విద్యార్థిని ఆత్మహత్య!

ఆదోని నేరవార్తలు, ఆస్పరి, న్యూస్‌టుడే: ఇంటర్ విద్యార్థిని(16)ని ప్రేమ పేరుతో వేధించడంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆస్పరి మండలంలో శుక్రవారం జరిగింది. వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న బాలిక దసరా సెలవుల నిమిత్తం స్వగ్రామానికి వచ్చింది. శుక్రవారం ఉదయం తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో బాలిక ఒక్కతే ఉన్న సమయంలో గ్రామానికి చెందిన బాలుడు (17) ప్రేమించాలని వేధించాడని, దీంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తాము ఇంటికి వచ్చి చూసేసరికి బాలుడు పరారయ్యాడన్నారు. తీవ్ర అస్వస్థతకు గురైన తమ కుమార్తెను ద్విచక్రవాహనంపై ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లామన్నారు. వైద్యులు పరీక్షించి బాలిక మృతిచెందిందని నిర్ధారించారని కన్నీరుమున్నీరుగా విలపించారు. తమకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆదోనిలో అంతర్ రాష్ట్ర వాహనాల దొంగ అరెస్టు

☛ రూ.21.53 లక్షలు విలువైన 23 బైక్‌లు స్వాధీనం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని ప్రాంతంలో వరుసగా ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగను ఆదోని ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆదోని డీఎస్పీ సోమన్న, సీఐ శ్రీరామ్ వివరాలను వెల్లడించారు. ఆదోని పట్టణం రాంజల ప్రాంతంలో నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్తబురుజు గ్రామానికి చెందిన మంగపెద్ద రంగనాయకులు అలియాస్ కోమరం పులి అనే వ్యక్తి వాహనంపై వెళ్తూ.. పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. విచారించగా చోరీల విషయం బయటపడిందన్నారు. వరుసగా బైక్‌ల చోరీకి పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. కోమరం పులి ఆదోని పట్టణంలోని రణమండల ఆంజనేయస్వామి గుడి మెట్ల వద్ద ఐదు, చిన్నశక్తి గుడి ప్రాంతంలో ఐదు, కొత్త ఫ్లైఓవర్ సమీపంలో 12 బైక్‌లు చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. పూర్తిస్థాయిలో విచారించి చోరీకి గురైన మొత్తం 23 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.21.53 లక్షలు దాకా ఉంటుందని డీఎస్పీ పేర్కొన్నారు. కేసు ఛేదించడం ప్రతిభ చూపిన సీఐ, సిబ్బందిని అభినందించారు. స్వాధీనం చేసుకున్న బైక్‌లను బాధితులకు అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై రామస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడు, బైక్‌లను చూపిస్తున్న డీఎస్పీ సోమన్న, సీఐ శ్రీరామ్, సిబ్బంది

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

పత్తి అంతంత మాత్రం.. వేరుశనగ ధర పతనం

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పత్తి ధరల్లో స్వల్పంగా పెరుగుదల చోటుచేసుకుంది. 8,880 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి వచ్చింది. క్వింటాలు కనిష్ఠంగా రూ.4390, గరిష్ఠంగా రూ.7,651, మధ్య ధర రూ.7,389లు పలికాయి. 16వ తేదీన పలికిన ధరతో పోలిస్తే క్వింటాలుపై రూ.60 పెరిగింది. సీసీఐ రాకతోనైనా పత్తి ధరల్లో పెరుగుదల చోటుచేసుకుంటుందేమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

☛ ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం వేరుశనగ ధర తగ్గుముఖం పట్టింది. 2,720 బస్తాలు అమ్మకానికి రాగా, క్వింటాలు కనిష్ఠంగా రూ.3,269, గరిష్ఠంగా రూ.6,561, మధ్య ధర రూ.6,389 పలికాయి. ధరల పడిపోతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం, సరకు నాణ్యత లేకపోవడం, మార్కెట్ ప్రభావం వల్లే ధరలు తగ్గాయని వ్యాపారులు పెర్కొంటున్నారు.

మద్యం దుకాణం ఎదుట మహిళల నిరసన

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి కొత్త బస్టాండు సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం ఎదుట మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. శివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన దుకాణాన్ని వెంటనే తొలగించాలని ఎస్సై అశోక్ ఫిర్యాదు చేశారు. చర్యలు చేపట్టలేకపోతే ఆందోళనలు చేపడతామని భాజపా మహిళ నాయకురాలు శాంతి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

దేవనకొండ, న్యూస్‌టుడే: **సమస్య:** అయ్యప్ప దేవాలయం సమీపంలోని కాలనీలో మురుగు కాల్వలు నిర్మించలేదు. 20 ఏళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్నాం.
– వెంకన్న, స్థానికుడు

సమాధానం: పైఅధికారులకు వివరించాం. నిధులు మంజూరైతే పనులు చేపడతాం. – రఫీ, పంచాయతీ కార్యదర్శి, దేవనకొండ

మద్దికెర, న్యూస్‌టుడే: **సమస్య:** మద్దికెర బస్టాండు నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకు వరకు ఒక వైపే మురుగు కాల్వ నిర్మించి వదిలేశారు. రెండు వైపులా పూర్తి చేయాలి. – రామాంజనేయులు, మద్దికెర

సమాధానం: కాల్వ పనులు ఇప్పటికే ఓ వైపు పూర్తయ్యాయి. మరో వైపు వెంటనే పనులు చేపడతాం.
– శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర

తుగ్గలి, న్యూస్‌టుడే: సమస్య: తుగ్గలిలోని ఎన్టీఆర్ కాలనీలో సిమెంట్ రహదారులు లేవు. వర్షం వస్తే బురదమయంగా మారి, రాకపోలకు చాలా ఇబ్బందిగా ఉంది.
- దేవేంద్ర, తుగ్గలి

సమాధానం: గ్రామంలో ప్రాధాన్య క్రమంలో అన్ని కాలనీల్లో సిమెంట్ రహదారులు నిర్మించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.
- రవిప్రసాద్, గ్రామ సర్పంచి తుగ్గలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్య: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అమలు కావడం లేదు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించండి.
- మహదేవ, ఇస్సీ (ఆదోని)

సమాధానం: పాఠశాలను తనిఖీ చేసి మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం
- శ్రీనివాసులు, ఎంఈవో (ఆదోని)

స్నేహపూర్వకంగా వ్యవహరించాలి

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. పత్తికొండ పోలీసు స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. కేసుల పురోగతిపై ఆరా తీశారు. డీఎస్పీ వెంకటరామయ్య, శిక్షణ డీఎస్పీ ఉషశ్రీ, సీఐలు పులిశేఖర్, జయన్న తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


తుగ్గలి: జొన్నగిరి ఠాణాను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

తుగ్గలి, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. జొన్నగిరి, తుగ్గలి ఠాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు వాటి స్థితి గతులు, నిందితులు అరెస్టు, కేసుల దర్యాప్తు, వాటి పురోగతిపై ఆయన స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఎస్సైలు జయశేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో మెగా ఉద్యోగ మేళా 21న

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని డాక్టరు జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో ఈ నెల 21వ తేదీన మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ కె.ఎస్.మురళీబాబు తెలిపారు.

మహిళలు.. మైదానంలో రాణులు

☛ క్రీడా పోటీల్లో విజయాలు
☛ స్నేహ బృందాల స్ఫూర్తి



ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: వారంతా మైదానంలో ఉదయం నడక సాగించే మహిళలు. అక్కడికి వచ్చేవారు స్నేహ బృందంగా ఏర్పడ్డారు. వ్యాయామంతో పాటు క్రీడల సాధనపైనా దృష్టి సారించారు. వయసుతో సంబంధం లేకుండా ఎక్కడ ఆటల పోటీలు జరిగినా ధైర్యంగా పాల్గొంటున్నారు.. పతకాలు సాధిస్తున్నారు. ఆదోని అర్ట్స్ కళాశాల మైదానం వీటి ఆటల పోటీలకు వేదికగా మారింది. ఆదోని మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ఉమ్మడి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడా మీట్ నిర్వహించారు. తొలిసారి పోటీల్లోనే ప్రతిభ చాటి పతకాలు అందుకున్నారు. ఇదే ఉత్సాహంతో రాష్ట్ర స్థాయి మీట్‌కు సిద్ధమవుతూ రోజు వారీ సాధన చేస్తున్నారు.

తొలిసారి పోటీల్లో పాల్గొన్నా

నా పేరు నాగవేణి, నేను కిరాణం వ్యాపారంతో ఉపాధి పొందుతున్నా. అండర్-45 మహిళా విభాగంలో పోటీలో పాల్గొన్నా. నేను తొలిసారి పోటీలు కావడంతో ఆరంభంలో కొంత భయం, ఆందోళనకు గురయ్యా. రోజువారీ నడక సాధన నాకు పోటీల్లో ఎంతగానో ఉపయుక్తంగా మారింది. తొలి అవకాశంలోనే 800 మీటర్ల పరుగులో బంగారు, షాట్‌పుట్‌లో వెండి, వంద మీటర్ల పరుగు పోటీల్లో రజత పతకాలు అందుకున్నా.



మా వారి ప్రోత్సాహంతో

నా పేరు రాణి.. మా వారు అన్నర్బాషా బ్యాంకు ఉద్యోగి. నేను కుట్లు, అల్లికలతో ఉపాధి పొందుతున్నా. చిన్నతనంలో ఆడిన ఆటలే. తప్ప, పెద్దగా సాధన చేయలేదు. మైదానంలో అడుగు పెట్టాక.. తోటి వారి ఉత్సాహం నాలో క్రీడా స్ఫూర్తి నింపింది. అలా రోజూ సాధన చేసే వారిని చూసి, పోటీలో పాల్గొనాలని పించింది. ఇందులో మా ఆయన ప్రోత్సాహంతో సాధన చేస్తూ.. ఆటల పోటీల్లో పాల్గొన్నా. ట్రిపుల్ జంప్‌లో వెండి, పరుగు పదెంలో రజత పతకాలు అందుకున్నా.



వైద్యవృత్తితో పాటు క్రీడలు



నా పేరు డాక్టర్ వినితా.. ఆయుర్వేద వైద్యురాలిని. మా వారు డాక్టర్ మిరియాల సతీష్, దంత వైద్యులు. వృత్తి పరంగా తీరిక లేకపోవడం, ఒత్తిడి ఉంటోంది. ఇలాంటి వాటి నుంచి బయటపడేందుకు మైదానంలో వ్యాయామం ఎంతగానో ఉపయోగపడింది. స్నేహితులతో కలిసి మైదానంలో ఇష్టమైన ఆటల్లో సాధన చేయడం అలవాటు చేసుకున్నా. జిల్లా స్థాయి వెటరన్స్ పోటీల్లో పాల్గొనా. వంద మీటర్ల పరుగులో బంగారం, జావలిన్‌త్రో, షాట్‌పుట్ పోటీల్లో వెండి పతకాలు సాధించా. రాష్ట్రస్థాయి పోటీలకు సాధన చేస్తున్నా.

నీటి శుద్ధిని పరిశీలించిన కమిషనర్

స్పందనకు వందనం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని రాంజల చెరువు ప్రాంతంలో శుద్ధజల కేంద్రాన్ని పురపాలక కమిషనర్ కృష్ణ శుక్రవారం పరిశీలించారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో 17వ తేదీన ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీల్లో కుళాయిల్లో మురుగు నీరు వస్తోందని ఫిర్యాదులు అందాయి. ఇందుకు స్పందించిన కమిషనర్ చెరువు ప్రాంతంలో శుద్ధజల కేంద్రాన్ని పరిశీలించి, క్లోరినేషన్, ఆలం నిర్వహణను తనిఖీ చేశారు. నీటిని శుద్ధిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కృష్ణగిరి, న్యూస్‌టుడే: కృష్ణగిరి మండలంలోని చిట్యాల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న లోకేశ్‌ను సస్పెండ్ చేస్తూ.. జిల్లా విద్యాధికారి శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని ఉపాధ్యాయునిపై వచ్చిన ఆరోపణలు విచారణలో వాస్తవమేనని తేలడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

అటవీ భూముల పరిశీలన

కప్పట్రాళ్ల (దేవనకొండ), న్యూస్‌టుడే: మండలంలోని కప్పట్రాళ్ల రక్షిత అడవుల్లో యురేనియం నిల్వలు ఉన్నాయని అందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందనే పుకార్లతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఉప తహసీల్దార్ సుదర్శనం, ఆర్ఐ వెంకటేష్, వీఆర్వో సూరీడు రక్షిత అడవుల్లోని సర్వే నంబరు 829లో అటవీ భూములను శుక్రవారం పరిశీలించారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి, కలుగొట్ల, రామళ్లకోట విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్తు శాఖ ఏఈ రాఘవేంద్ర అన్నారు. విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పల్లె కబుర్లు

జీఎర్రగుడి(తుగ్గలి), న్యూస్‌టుడే: గుత్తి- పత్తికొండ ప్రధాన రహదారికి మరమ్మతు పనులు చేపట్టాలని సీపీఎం నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. జి.ఎర్రగుడి వద్ద దెబ్బతిన్న రహదారికి అడ్డంగా నిలిచి నాయకులు కొండారెడ్డి, రామకృష్ణ, శ్రీరాములు ధర్నా చేపట్టారు.

మద్దికెర, న్యూస్‌టుడే: పంచాయతీల పాలకవర్గ సభ్యులు గ్రామాలను ప్రగతి పథంలో నడిపించేలా పనిచేయాలని ఎంపీపీ అనిత, ఎంపీడీవో కొండయ్య, ఈవోపీఆర్డీ మద్దిలేటిస్వామి తదితరులు అన్నారు. పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు.

లింగనేనిదొడ్డి(తుగ్గలి), న్యూస్‌టుడే: లింగనేనిదొడ్డిలో గ్రామ సభ శుక్రవారం నిర్వహించినట్లు ఇన్‌ఛార్జి తహసీల్దారు నాగరాజు తెలిపారు. 19న రాతన, 22న ఎద్దులదొడ్డి, 23న గుత్తి ఎర్రగుడి, 24న తుగ్గలి రెవెన్యూ గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు.

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆదోని ఈవో ఆర్డీ జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.

మల్లెపల్లి(వెల్దుర్తి), న్యూస్‌టుడే: మల్లెపల్లి గ్రామంలో సాగుచేసిన పత్తి, కంది, ఉల్లి పంటలను జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ, ఏడీఏ వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శశిధర్‌రెడ్డి, సర్పంచి వెంకటేశ్వరరెడ్డి, మండల వ్యవసాయాధికారి అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

మద్దికెర, న్యూస్‌టుడే: ఇటీవల గుర్రం స్వారీ ప్రమాదంలో మృతిచెందిన పృథ్వీరాజ్ కుటుంబ సభ్యులకు పూర్వ విద్యార్థుల మిత్ర బృందం ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. 2009 బ్యాచ్‌కు చెందిన మిత్రులు శుక్రవారం పృథ్వీరాజ్ భార్య గాయత్రికి రూ.80వేలు అందించారు.


ఆర్థిక సాయం అందిస్తున్న మిత్ర బృందం

ఎంపీపీ కుమారుడా.. మజాకా!

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో విజయలలిత, మండల విస్తరణాధికారి చక్రవర్తి హాజరయ్యారు. ఎంపీపీ నూర్జహాన్ స్థానంలో ఆమె తనయుడు ఈసా వేదికపై కూర్చున్నారు. ఏ హోదాలో పాల్గొన్నారో అని అక్కడికి వచ్చిన వారు చర్చించుకున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవోతో ప్రస్తావించగా.. ఇలాంటివి జరగకుండా చూస్తామన్నారు.


వేదికపై కూర్చున్న ఎంపీపీ తనయుడు ఈసా

భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు

హాలహర్వి, న్యూస్‌టుడే: గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. ఇంగళదహాళ్ గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో పాల్గొన్నారు. ఆయన వెంట తహసీల్దారు సతీష్ కుమార్, రీ-సర్వే ఉప తహసీల్దారు ముకుంద రావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, వీఆర్వోలు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. మండల పరిధిలో కుర్లేహళ్లి గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజ్మిబాను, రీసర్వే ఉప తహసీల్దారు బ్రహ్మయ్య, మండల సర్వేయర్ మంజు భార్గవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలు ఉపయోగపడతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆదోని తహసీల్దారు శివరాముడు అన్నారు. ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలకు సంబంధించి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆదోని రీ సర్వే డీటీ పెద్దయ్య, సర్పంచి సరళమ్మ, ఎంపీటీసీ కారెప్ప, వీఆర్వోలు విష్ణుప్రియ, కల్యాణి, రమేష్, మహేంద్ర, సర్వేయర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పుల్లగుమ్మి(వెల్దుర్తి), న్యూస్‌టుడే: పుల్లగుమ్మి గ్రామంలో చేపట్టిన భూ రీసర్వే సమస్యలను పరిష్కరిస్తామని కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్ అన్నారు. గ్రామంలోని సచివాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్‌వర్మ, తెదేపా నాయకుడు నాగేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.


హాలహర్వి: వినతులు స్వీకరిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

అగ్రహారం(మద్దికెర), న్యూస్‌టుడే: మండలంలోని అగ్రహారంలో శుక్రవారం ఉప తహసీల్దారు శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో రైతులు సమస్యలను విన్నవించారు.

ఏ.గోనేహాలు(ఆలూరు గ్రామీణ), న్యూస్‌టుడే: ఏ.గోనేహాలు గ్రామంలో రీసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. 27 మంది రైతులు తమ సమస్యలను తహసీల్దారు గోవింద్ సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో మండల సర్వేయర్ అరుణజ్యోతి, వీఆర్ఓ రవికుమార్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

దేవనబండ(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: దేవనబండలో నిర్వహించిన గ్రామ సభలో పత్తికొండ తహసీల్దారు రమేశ్ మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారానికి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలునాయక్, శ్రీనివాసులు, మండల సర్వేయర్ గాదెలింగప్ప, వీఆర్వో బాషా, సచివాలయ సర్వేయర్లు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

మద్దికెర, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించే ఎస్సీ విద్యార్థినీ, విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బండారు చిత్తరంజన్‌దాస్ అన్నారు. మద్దికెరలో శుక్రవారం మాట్లాడుతూ.. 10వ తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచే విద్యార్థికి రూ.30 వేలు, ద్వితీయ రూ.20వేలు, తృతీయ రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, శాంతి, వెంకటదాసు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి పొలాలలో చిరుత సంచారం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి సమీపంలోని సుబ్బయ్య తాత ఆలయానికి వెళ్లే మార్గంలోని పొలాలలో చిరుత సంచరించిన జాడలు కనిపించడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

కుండపోత వర్షం.. వీధులు జలమయం

☛ పొలాల్లోకి చేరిన నీరు.. తడిసిన దిగుబడులు ☛ ఉప్పొంగిన వాగులు.. రాకపోకలకు ఆటంకం


ఆదోనిలోని జైన్ మందిరం ప్రాంతంలో వీధి జలమయం


ఆదోని ప్రభాకర్ టాకీస్ రహదారిలో..

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, భీకర శబ్దాలతో వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం పొడిగా ఉన్నా.. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు కమ్ముకుని కుండపోతగా కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగు కాలువలు పొంగిపోర్లాయి. 167వ జాతీయ రహదారిలో సర్వజన ఆస్పత్రి ప్రాంతంలో నీటి నిల్వ వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


కురుకుంద గ్రామంలో పొలంలో నిలిచిన వర్షం నీరు

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కురుకుంద గ్రామంలో వర్షానికి పంట పొలంలో నీరు నిలిచింది. పంటలు కోతకొచ్చే సమయంలో ఇలా వర్షాలు రావడంతో తీవ్ర నష్టం మిగిలిందని అన్నదాతలు వాపోతున్నారు. కురిసిన వర్షానికి మొలగవల్లి - ఆలూరు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. రెండు గ్రామాల మధ్య మూడు వాగులున్నాయి.

పండు మిరప వర్షార్పణం


ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు హనుమేశ్

ఆస్పరి, న్యూస్‌టుడే: మండలంలోని గార్లపెంట గ్రామానికి చెందిన రైతు హనుమేష్ తనకున్న రెండెకరాల్లో బ్యాడిగి మిరప సాగు చేశారు. రూ.1.80 లక్షలతో సాగు చేశారు. పండు మిరప కోత కోసి ఆరబోశారు. కురిసిన వర్షానికి దిగుబడి పూర్తిగా తడిసి పోయింది. చెట్టుకున్న మిరప పండు సైతం వర్షానికి తడిసి కిందకు రాలిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షంతో రూ.లక్షలు నష్టపోయానని కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.


ఆలూరు– మొలగవల్లి దారిలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం


ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాలను అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. పెద్దహరివాణం గ్రామంలో శుక్రవారం పల్లెపండుగ కార్యక్రమంలో రూ.15లక్షల సిమెంటు రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ, రాష్ట్ర నాయకులు ఉమ్మిసలీం, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు దేవేంద్రప్ప, జనసేన బాధ్యుడు మల్లప్ప, భాజపా జిల్లా అధ్యక్షుడు నీలకంఠ, రాష్ట్ర నాయకులు విట్టా రమేష్, మాజీ ఎంపీపీ పంపాపతి, సర్పంచి రాము, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దహరివాణంలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, తదితరులు

గుంటుపల్లి(వెల్దుర్తి), న్యూస్‌టుడే: మండలంలోని గుంటుపల్లి గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రహదారి పనులను పత్తికొండ నియోజకవర్గ తెదేపా రైతు సంఘం అధ్యక్షుడు ఈదుల వెంకటరాముడు శుక్రవారం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంతో రహదారి పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పత్తి బేజారు.. కంది సాగు జోరు

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆలూరు వ్యవసాయసబ్ డివిజన్‌లో కంది పంట సాగు విస్తీర్ణం పెరిగింది. గతంలో ఎన్నడూలేనంతగా మార్కెట్‌లో కంది ధర అధికంగా ఉంది. పత్తి దిగుబడి తగ్గడంతో పాటు మార్కెట్‌లో ధర అంతంత మాత్రంగానే ఉండటం వల్ల రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిసారించారు. దీంతో కంది సాగు పెరిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా. ఆలూరు నియోజకవర్గంలోని ఆలూరు, ఆస్పరి, హాలహర్వి, చిప్పగిరి, హొళగుంద, దేవనకొండ మండలాల్లో గతంతో పోలిస్తే.. రైతులు ఈసారి ఆసక్తి చూపారు. సబ్ డివిజన్‌లో కేవలం 1800 ఎకరాలు సాధారణ సాగు కాగా ఈ ఏడాది 15వేల ఎకరాల్లో పంటసాగైందని అధికారులు వెల్లడించారు.


సాగైన కంది పంట

పంట మార్పు మంచిదే

– సునీత, ఏడీఏ ఆలూరు

రైతులు ఎప్పుడూ ఒకే పంటను కాకుండా మార్చిడి చేసుకోవాలి. దీంతో అధిక దిగుబడులు సాధించవచ్చు. పత్తి పంటను ఏటా సాగుచేయడం వల్ల భూమిలో ధాతువులు లోపించి తెగుళ్లు కూడా ఎక్కువగా ఆశిస్తాయి. మార్కెట్‌లో మంచి ధర లభించడంతో రైతులు ఈ ఏడాది అధికంగా సాగుచేశారు.

ధరల ప్రభావంతోనే..

రెండేళ్లుగా పత్తి దిగుబడి తక్కువగా ఉండటంతో పాటు మార్కెట్‌లో ధర కూడా లేకపోవడం, అధికంగా తెగుళ్లు సోకి పంటను దెబ్బతీస్తున్నాయి. అంతేకాక పంటకు పెట్టుబడి అధికంగా కావడం రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. అందుల్ల రైతులు దాని స్థానంలో కంది పంటకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. తక్కువ పెట్టుబడితో పాటు పనులు కూడా తక్కువగా ఉండటం, మార్కెట్‌లో ఎక్కువ ధర ఉండటంతో రైతులు పత్తి స్థానంలో కంది సాగు చేపట్టారు. పత్తి పంట ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో 45 వేల హెక్టార్లు సాధారణ సాగు కాగా ఈ ఏడాది 34 వేల హెక్టార్లలో పత్తి సాగు చేపట్టారు. 11 వేల హెక్టార్లలో సాగు తగ్గింది. ఈ సారి సాధారణం కంటే తక్కువగా సాగైందని వ్యవసాయ అధికారులు వెల్లడించారు. కంది పంట కేవలం 1800 ఎకరాలు సాధారణ సాగు కాగా ఈ సారి 15వేల ఎకరాల్లో సాగైంది.

గండాలు దాటితేనే.. గమ్యం చేరేది

☛ అడుగడుగునా గుంతలు
☛ అధ్వానంగా దారులు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ మండలంలోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. గత వైకాపా పాలనలో ఐదేళ్లు రహదారుల మరమ్మతులను పూర్తిగా నిర్లక్ష్యం చేయటంతో ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. ఎక్కడ చూసినా గోతులు పడటంతో వాహన దారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఆయా మార్గాల్లో ప్రయాణమంటేనే జనం హడలి పోయే పరిస్థితి నెలకొంది.


పత్తికొండ– గుంతకల్లు మార్గంలో హోసూరు సమీపంలో రహదారి దుస్థితి

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

కొన్ని నెలలుగా పత్తికొండ ఆర్‌అండ్‌బీ పరిధిలోని ఆయా మార్గాల్లో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు చేపట్టేందుకు రూ.70లక్షల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టి రహదారుల మరమ్మతులు పూర్తిచేస్తాం.

– శ్వేత, ఆర్‌అండ్‌బీ జేఈ, పత్తికొండ

ఇదీ పరిస్థితి..

☛ పత్తికొండ నుంచి గుంతకల్లు వెళ్లే ప్రధాన మార్గంలో హోసూరు సమీపంలో పలు చోట్ల రహదారి గుంతల మయంగా మారాయి. పత్తికొండ నుంచి నాలుగు కి.మీ దూరంలో ఉన్న హోసూరుకు వెళ్లాలంటే బస్సు ప్రయాణం సైతం గగనంగా మారింది. ద్విచక్ర, ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల పరిస్థితి మరింత ప్రమాదకరమని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

☛ పత్తికొండ నుంచి ఆదోని వెళ్లే ప్రధాన మార్గంలోనూ పలు చోట్ల రహదారులు ఛిద్రమయ్యాయి. చిన్నహుల్తి, దేవనబండ, అటికెలగుండు, ఆస్పరి ప్రాంతాల్లోని దారుపైనా పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరి మరింత ప్రమాదకరంగా మారాయి. గుంతలు గుర్తించలేక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పత్తికొండ నుంచి ఆదోనికి వివిధ పంటల దిగుబడులు విక్రయించేందుకు వెళ్లే వాహనాలు గుంతల కారణంగా బోల్తా పడి పంట దిగుబడులు సైతం నష్టపోయే పరిస్థితి నెలకొందని రైతులు, వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆయా మార్గాల్లో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

గ్రామాల్లో కలసిమెలిసి ఉండాలి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో అనవసరంగా గొడవలకు పాల్పడకుండా కలిసిమెలిసి ఉండాలని



ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. శుక్రవారం రాత్రి గోనెగండ్ల మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన కున్నూరును సందర్శించారు. పోలీస్ పికెట్‌ను తనిఖీ చేశారు. ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలగాలని పోలీసులకు సూచించారు. ప్రధాన కూడలి వద్ద గ్రామస్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆయన వెంట గోనెగండ్ల సీఐ గంగాధర్ ఉన్నారు.

కున్నూరు గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

22న జిల్లా స్థాయి భజన పోటీలు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలోని చింతలామునిస్వామి, నల్లారెడ్డి స్వాముల ఆలయంలో నెల పూజోత్సవం సందర్భంగా ఈ నెల 22న జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. విజేత బృందాలకు 30, 20, 15, 10, 8 తులాల వెండి పతకాలు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794
కోడుమూరు : 80085 73776

కోడుమూరు గ్రామీణం: **సమస్య:** కొండపేట బాలవినాయక కల్యాణ మండపం వెనుక అపరిశుభ్రత నెలకొంది. కొన్ని రోజులుగా చెత్త తొలగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. **- గోపాల్, కోడుమూరు**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్త తొలగిస్తాం. **- అజయ్‌భాస్కర్, ఈవో**

కోసిగి: **సమస్య:** మండలంలోని అగసనూరు గ్రామంలో ప్రధాన రహదారిపై గుంతలు పడి వర్షం నీరు నిలుస్తోంది. రాకపోకలకు కష్టంగా ఉంది. గుంతలను పూడ్చివేయించగలరు. **- సిద్ధప్ప, స్థానికుడు**

సమాధానం: గుంతల్లో గరుసు వేయించి పూడ్చివేయిస్తాం. **- ఉలిగయ్య, సర్పంచి**

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్‌లో జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక మహిళలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. మద్యం అమ్మకాలతో ఘర్షణలు చోటుచేసుకుంటాయని పేర్కొన్నారు. ఎస్సై తిమ్మారెడ్డి వచ్చి మద్యం దుకాణం జనావాసానికి దూరంగా ఏర్పాటు చేసేలా ఉన్నతాధికారులతో మాట్లాడుతామని సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు.

14 మంది పత్తి వ్యాపారులకు తాఖీదులు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: పట్టణంలో మార్కెట్ శాఖ నుంచి అనుమతి (లైసెన్స్) తీసుకోకుండా పత్తి కొనుగోలు చేసే వ్యాపారులు 14 మందిని గుర్తించి తాఖీదులు ఇచ్చినట్లు కార్యదర్శి పద్మావతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ... అనుమతి లేకుండా పత్తిని కొంటే చర్యలు తీసుకుంటామన్నారు.

పనులు వేగవంతం చేయండి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, సకాలంలో పూర్తి చేయాలని గుత్తేదారులను పురపాలక కమిషనర్ గంగిరెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని మిలటరీ కాలనీలో రూ.10 లక్షలతో చేపడుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లేకపోతే బిల్లులు నిలిపివేస్తామన్నారు. సీసీ కాల్వలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఏఈ శరత్ ఉన్నారు.

గృహ లక్ష్మీ కటాక్షమస్తు

☛ ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణాలపై సర్వే పూర్తి
☛ త్వరలో ఖాతాల్లో జమకానున్న నిధులు



సర్వే చేస్తున్న గృహ నిర్మాణ శాఖ అధికారులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వ హయాంలో 2014-19లో ఎన్టీఆర్ గృహాలు నిర్మించుకున్న పేదలకు కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించనుంది. గత వైకాపా ప్రభుత్వం వారికి బిల్లులను నిలిపివేసింది. చాలా మంది లబ్ధిదారులు అప్పులు చేసి ఇళ్లు పూర్తి చేసుకున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో సుమారు 9,906 ఎన్టీఆర్ గృహాలు పూర్తి చేసుకున్నారు. ఒక్కో ఇంటికి సుమారు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఎమ్మిగనూరు, నందవరం, కోసిగి, పెద్దకడబూరు, మంత్రాలయం, గోనెగండ్ల, కౌతాళం, గూడూరు, సిబెళగల్‌లో మండలాల్లో రూ.30.16 కోట్లు పెండింగ్‌లో ఉంచారు. వారందరికీ బిల్లులు చెల్లించేందుకు గృహ నిర్మాణ శాఖ అధికారులు సర్వే చేపట్టారు.

వలసలు వెళ్లి.. అప్పులు చేసి..

పశ్చిమ ప్రాంతంలో పేదలు ఎక్కువగా వలసలు వెళ్తుంటారు. వారంతా అప్పులు చేసి ఇళ్లు పూర్తి చేసుకున్నారు. అప్పులు చేసి నిర్మించిన ఇళ్లకు వైకాపా ప్రభుత్వ హయాంలో బిల్లులు రాకపోవడంతో ఐదేళ్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వంలో అధికారులు పూర్తి స్థాయి సర్వే చేసి గృహాలు నిర్మించుకున్నవారు, మధ్యలో ఆపేసినవారు, స్లాబ్ వరకు, పూర్తి బిల్లులు రానివారు తదితర వివరాలను సేకరించారు. 2019లో వైకాపా ప్రభుత్వం ఏర్పడటంతో వారికి బిల్లులు ఇవ్వలేదు. 2014-19లో మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో 8,274 ఇళ్లకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 3,653 గృహాలకు సుమారు రూ.13 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తేల్చారు. మంత్రాలయం లోనూ ఇదే పరిస్థితి.

మండలం	బిల్లు రావాల్సిన ఇళ్లు
నందవరం	1,574
ఎమ్మిగనూరు	1,009
గోనెగండ్ల	1,070
పెద్దకడబూరు	1,098
కోసిగి	1,256
మంత్రాలయం	992
కౌతాళం	1,318
గూడూరు	477
సి.బెళగల్	1,112

రూ.70 వేల బిల్లు రావాలి - వెంకటలక్ష్మి, కడివెళ్ల



గత తెదేపా ప్రభుత్వంలో మేం ఇల్లు కట్టుకున్నాం. అప్పుడు సుమారు రూ.5 లక్షల ఖర్చయ్యింది. మేం కూలీ పనికి వెళ్లి ఇల్లు నిర్మించుకున్నాం. రూ.70 వేలు బిల్లు రావాలి. వైకాపా పాలనలో ఎన్నోసార్లు అధికారుల చుట్టూ తిరిగాం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బిల్లు ఇస్తామని చెప్పడం ఆనందంగా ఉంది.

వలస వెళ్లి నిర్మించుకున్నాం - రంగమ్మ, కడివెళ్ల



మేము కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తాం. వలస వెళ్లి రూ.9 లక్షలతో ఇల్లు నిర్మించుకున్నాం. అప్పుడు ఒక బిల్లు వచ్చింది. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వంలో మిగతా డబ్బులు రాలేదు. రెండేళ్లు కూలీ పనులకు వలస వెళ్లాం. మాకు రూ.లక్షకుపైగా బిల్లు రావాల్సి ఉంది. ఈ ప్రభుత్వం మంజూరు చేస్తే అప్పులు తీర్చుకుంటాం.

సర్వే పూర్తి చేశాం - ప్రసాద్, హౌసింగ్ డీఈ, ఎమ్మిగనూరు డివిజన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకున్న వారి వివరాలపై నెల రోజులు సర్వే చేశాం. ఎంత మందికి బేస్‌మట్టం, రూఫ్ లెవెల్, స్లాబ్ లెవెల్, పూర్తి బిల్లు ఇవ్వాల్సి ఉంది తదితర వివరాలన్నీ సేకరించాం. కొన్ని గ్రామాల్లోని లబ్ధిదారుల పేర్లు పరిశీలించాల్సి ఉంది. ఎన్టీఆర్ గృహాలతోపాటు ప్రస్తుతం నిర్మిస్తున్న ఇళ్లకు కూడా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుంది.

నేడు విద్యుతు సరఫరాలో అంతరాయం

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు సబ్ డివిజన్ పరిధిలోని సి.బెళగల్, లద్దగిరి 33 కేవీ ఫీడర్లు, 132/33 కేవీ ఉపకేంద్రలో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్తు సరఫరాలో కోత విధిస్తున్నట్లు డీఈ జెసన్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు.

గోనెగండ్లలో...

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని గోనెగండ్ల, కైరవాడి, కులుమాల, ఎర్రబాడు గ్రామాల్లోని విద్యుత్తు ఉపకేంద్రాల్లో మరమ్మతుల వల్ల శనివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సుధాకర్‌రావు శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు కోత విధిస్తున్నామన్నారు.

సుంకేసులకు 43,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి 43,560 క్యూసెక్కులు వరద నీరు వస్తోందని జలాశయ ఇంజినీర్ రాజు తెలిపారు. శుక్రవారం జలాశయంలో 1.235 టీఎంసీలు నిల్వ ఉండటంతో దిగువకు 10 గేట్లు ఎత్తి 43,515 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని, తేడా వస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఈవో ఆంజనేయులు హెచ్చరించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని గంజహళ్లి రోడ్డులో ఎంపీపీ పాఠశాలలో భోజనం, దస్త్రాలను పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని ధర్నా



విద్యుత్తు శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యుత్తు ఛార్జీలను తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదలపై మళ్లీ ఛార్జీలు పెంచుతున్నారని సీపీఎం నాయకుడు గోవింద్ ఆరోపించారు. శుక్రవారం విద్యుత్తు ఉపకేంద్రం ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ప్రజలపై మోయలేని భారం మోపారన్నారు. నిత్యావసర సరకుల ధరలు ఆకాశన్నంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాముడు, రమేశ్, రవి, కాళ్లప్ప, పరమేశ్, బజారి, పాల్గొన్నారు.

కోడుమూరులో...

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు బిల్లులు తగ్గించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న డిమాండు చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్తు ఉపకేంద్రం ఎదుట ధర్నా చేపట్టారు. పించను మినహా ఏ హామీ అమలు కాలేదన్నారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో బిల్లుల మోత మోపారన్నారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించాలని కోరుతూ ఏఈ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు గఫూర్‌మియా, వీరన్న, వెంకటేశ్, శంకర్, బుడ్డప్ప పాల్గొన్నారు.

బురద.. ప్రయాణానికి వ్యథా



కోడుమూరులో ఎమ్మిగనూరు-కర్నూలు ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. శుక్రవారం కురిసిన వర్షానికి కొత్త బస్టాండు సమీపంలో అంపయ్య సర్కిల్ దగ్గరున్న రహదారిపై వర్షం నీరు నిలిచి బురదగా మారింది. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలో మురుగు కాల్వ లేకపోవడం, దారంతా గుంతలు పడటంతో వర్షం నీరు వెళ్లే మార్గం లేక దారంతా బురదగా మారుతోందని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా దారికి మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, కోడుమూరు పట్టణం**

ఆర్టీసీ ప్రాంగణం.. అసౌకర్యాలకు నిలయం



మంత్రాలయం ఆర్టీసీ ప్రాంగణం అధ్వానంగా తయారైంది. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఇక్కడకు వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రాంగణం పక్కన గతంలో పార్కులో బెంచీలు, చెట్లు, తాగునీటి సౌకర్యంతో ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. ప్రయాణికులు పార్కులో సేద తీరేవారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రస్తుతం పిచ్చిమొక్కలు పెరిగాయి. చెత్తాచెదారంతో అధ్వానంగా మారింది. **- న్యూస్‌టుడే, మంత్రాలయం**

పత్తి కొనుగోళ్లు చేపట్టాలి

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు చేపట్టాలని రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బాలరాజు డిమాండు చేశారు. శుక్రవారం ఏడీఎం నారాయణమూర్తికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఐఎఫ్‌టీయూ నాయకుడు బాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి



పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యాధికారి

మాదన్న సూచించారు. వర్కూరులో శుక్రవారం ఆరోగ్య పౌష్టికాహార కమిటీ సమావేశాన్ని ఆయన తనిఖీ చేశారు. 11 రకాల సంపూర్ణ పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది నరసప్ప, కమాల్‌సాహెబ్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు వేధింపులు తగదు



ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తలను వైద్య సిబ్బంది వేధిస్తున్నారని, వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకుడు రాముడు అన్నారు. శుక్రవారం ఆశా కార్యకర్తలు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు జాబ్ కార్డులు లేకున్నా, ఇష్టారాజ్యంగా పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు శివలక్ష్మి, రంగలక్ష్మి, రాణి, సుమిత్ర, లింగమ్మ, విశాలాక్షి పాల్గొన్నారు.

రీసర్వే భూముల సమస్యలు పరిష్కరిస్తాం: సబ్ కలెక్టర్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో భూముల రీసర్వేలో సమస్యలను పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. శుక్రవారం బనవాసిలో గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి భూసమస్యల వినతులు స్వీకరించారు. తాము లేకున్నా సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది భూములు రీసర్వే చేశారని కొందరు రైతులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భూముల విస్తీర్ణంలో తేడాలు ఇతర సమస్యలపై రైతులు 96 వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే సభలు

పొన్నకల్లు (గూడూరు), న్యూస్‌టుడే: భూసమస్యలు పరిష్కరించేందుకు గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కె.రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని జూలకల్లు మజారా గ్రామం పొన్నకల్లులో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి 60 వినతులు వచ్చాయని, 15 రోజుల్లో పరిష్కారం చూపుతామన్నారు. రీసర్వే డీటీ లోకేశ్వరరెడ్డి, వీఆర్వో జాకీర్, వీఎస్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

త్వరలోనే రైతుల సమస్యలకు పరిష్కారం

కోసిగి, న్యూస్‌టుడే: రైతుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని తహసీల్దార్ నిత్యానంద్‌రాజ్ అన్నారు. శుక్రవారం ఆయన కోసిగి మండలంలోని పల్లెపాడు గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉప తహసీల్దార్ రుద్రగౌడ్‌తో కలిసి గ్రామసభ నిర్వహించారు. సర్పంచి రాజారెడ్డి, వీఆర్వోలు, ఆర్ఐలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కౌతాళంలో..

కౌతాళం, న్యూస్‌టుడే: మండలంలోని గోతులదొడ్డి గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. రైతుల సమస్యలను తీర్చేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ మల్లికార్జున స్వామి అన్నారు. సమస్యలపై రైతుల నుంచి వినతులు స్వీకరించారు. చాలా మంది రైతులు ఆన్‌లైన్‌లో తప్పులు ఉన్నాయని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ రజనీకాంత్, ఎంపీడీవో సుబ్బరాజు, నాయకులు ఉలిగయ్య, అడివప్పగౌడ్ పాల్గొన్నారు.

కోడుమూరులో..

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో జరిగిన భూముల రీసర్వేలో తప్పులున్నాయని, వాటిని పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటేశ్ నాయక్‌కు రైతులు మొర పెట్టుకున్నారు. శుక్రవారం అమడగుంట్ల గ్రామంలో సర్పంచి వరలక్ష్మి అధ్యక్షతన రీసర్వే రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు.

గోనెగండ్లలో 120 వినతులు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రబాడులో తహసీల్దార్ కుమారస్వామి శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు అధిక సంఖ్యలో తరలిరావడంతో తోపులాట చోటు చేసుకుంది. 120 వరకు వినతులు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ శిరీషా, ఆర్ఐ జనార్దన్‌రావు, వీఆర్వో వెంకటేశ్వర రెడ్డి, సర్వేయర్ వీరేంద్ర పాల్గొన్నారు.

మంత్రాలయంలో 17 ఫిర్యాదులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: రైతుల నుంచి 17 ఫిర్యాదులు స్వీకరించినట్లు తహసీల్దార్ రవి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కగ్గల్లులో గ్రామ సభ నిర్వహించినట్లు తెలిపారు. భూసర్వే డీటీ సరస్వతి, మండల సర్వేయర్ అశోక్, ఆర్ఐ ఆదాము, వీఆర్వో పుష్ప, ఉప సర్పంచి సయ్యద్ పాల్గొన్నారు.

నందవరంలో...

నందవరం, న్యూస్‌టుడే: భూసమస్యలకు శాశ్వత పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నామని మండల సర్వేయర్ అక్బర్ బాషా, ఆర్ఐ జర్మియా అన్నారు. శుక్రవారం మండలంలోని ఇబ్రహీంపురంలో గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. నిజమైన భూహక్కుదారునికి ఎటువంటి అన్యాయం జరగకుండా పాసుపుస్తకాల్లో తప్పుగా నమోదైన వాటిని సరిచేస్తామన్నారు.

సి.బెళగల్‌లో 39 అర్జీలు

సి.బెళగల్, న్యూస్‌టుడే: మండలంలోని సంగాలలో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 39 మంది రైతులు రీసర్వేలో మా పొలాల్లో విస్తీర్ణంలో తక్కువ కొలతలు ఉన్నాయని, విచారించి న్యాయం చేయాలని వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ పురుషోత్తం, వీఆర్వోలు రఫీ, శేఖర్, రమణ పాల్గొన్నారు.

అపరాల సాగుతో మంచి ఆదాయం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు అపరాల సాగుతో మంచి ఆదాయం పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి అన్నారు. శుక్రవారం గోనెగండ్ల మండలంలో ఎంపిక



రైతులకు మినుముల విత్తనాలు అందజేస్తున్న కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి

చేసిన రైతులకు అపరాల్లో మినుముల సాగుపై శిక్షణ ఇచ్చారు. మినుముల్లో వంబన్-8, ఎల్‌బీజీ-904 రకాలు పల్లాకు తెగులు తట్టుకొని ఎకరానికి 8 నుంచి 9 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీచందన, రైతులు పాల్గొన్నారు.

సీసీ రహదారులకు భూమి పూజ



పనులు ప్రారంభిస్తున్న అధికారులు, తెదేపా నాయకులు

కౌతాళం, న్యూస్‌టుడే: మండలంలోని గోతులదొడ్డి, తిప్పలదొడ్డి గ్రామాల్లో శుక్రవారం పల్లె పండగ నిర్వహించారు. సీసీ రహదారుల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు ఉలిగయ్య, అడివప్పగౌడ్, సతీష్‌నాయుడు, ఎంపీడీవో సుబ్బరాజు, తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఏపీవో మదన్‌శంకర్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి

నాగలదిన్నె (నందవరం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని తెదేపా నాయకుడు జబ్బర్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాగలదిన్నె గ్రామంలో పల్లె పండగలో భాగంగా సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, ఏపీవో శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్ పాల్గొన్నారు.

సి.బెళగల్‌లో..

సి.బెళగల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో పల్లె పండగతో అభివృద్ధికి బాటలు పడ్డాయని పంచాయతీరాజ్ శాఖ ఏఈ వెంకటప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇనగండ్ల, సంగాల, తిమ్మందొడ్డి గ్రామాల్లో సర్పంచులు ఇమ్మానేయులు, హనుమంతు, నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. సంగాలలో రూ.5 లక్షలతో సీసీ రహదారికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకుడు వెంకటేశ్వర్లు, ఏపీవో రామన్న పాల్గొన్నారు.

పట్టణంలో తెరుచుకోని మూడు మద్యం దుకాణాలు

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలో లక్కీడిప్‌లో మద్యం దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులు మూడింటిని ఏర్పాటు చేయలేదు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఇద్దరికి పట్టణంలో మద్యం దుకాణాలు లభించాయి. వీరు గతంలో శివ కూడలిలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో ఏర్పాటు చేసుకునేందుకు నిర్వాహకుడికి రూ.2 లక్షలు అడ్వాన్స్ ఇచ్చినట్లు తెలిసింది. అయితే ఎక్సైజ్ శాఖ అధికారులు పక్కన ప్రైవేట్ ఆసుపత్రి ఉందని, అక్కడ ఏర్పాటు చేయకూడదని వ్యాపారిపై ఒత్తిడి తేవడంతో ఏర్పాటు చేయలేదని సమాచారం. తెలంగాణ ప్రాంతానికి చెందిన మద్యం వ్యాపారుల దుకాణాల్లో ఓ స్థానిక ప్రజాప్రతినిధి వాటా అడుగుతుండగా వారు ఇచ్చేందుకు ససేమిరా అనడంతో ఏర్పాటులో జాప్యం జరుగుతున్నట్లు పట్టణంలో చర్చ సాగుతోంది.

గ్రామ పరిపాలన విధానంపై ఉప సర్పంచులకు శిక్షణ

సి.బెళగల్, న్యూస్‌టుడే: ఉప సర్పంచులు, వార్డు సభ్యులు గ్రామ పరిపాలనలో ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. సి.బెళగల్ మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బి.మునెప్ప అధ్యక్షతన వారికి రెండు రోజుల శిక్షణ ఇచ్చారు. విద్యుత్తు బల్బులు అమర్చడం, పారిశుద్ధ్య పనులు, తాగునీటి సదుపాయాల కల్పన వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఆర్డీ ఈశ్వరయ్యస్వామి, పంచాయతీ కార్యదర్శి సునీల్ రాణి పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై పోలీస్ లాఠీ

☛ కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు అడ్డుకట్ట

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో ఎమ్మిగనూరు పట్టణంలో రాజకీయ అండతో చిన్న చిన్న అల్లరిమూకలు బృందాలుగా ఏర్పడి అలజడులు సృష్టించారు. పలు కాలనీల్లో అక్రమ మద్యం వ్యాపారం, గంజాయి వంటివి చాప కింద నీరులా వ్యాపించాయి. మట్కా, పేకాట నిర్వహణ గుట్టుగా సాగింది. ఇలాంటి చర్యలతో ప్రశాంత వాతావరణానికి భంగం ఏర్పడింది. వందల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర వర్గాల ప్రజలతో స్థానికుల్లోనూ అసహనం వ్యక్తమైంది.

ప్రస్తుతం కనిపిస్తున్న మార్పు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పట్టణంలో పట్టుతప్పిన శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించారు. ముక్కుసూటిగా వ్యవహరించే పోలీసు అధికారిగా గుర్తింపున్న సుదర్శన్‌రెడ్డిని పట్టణ సీఐగా నియమించారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన మూడు నెలల్లోనే గాడితప్పిన శాంతిభద్రతలపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. చిల్లర, చోటా గ్యాంగ్‌లకు తనదైన శైలిలో మంత్రణం నిర్వహించారు. పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి పెట్టారు. ప్రధాన కూడళ్లలో కానిస్టేబుళ్లను నియమించి ట్రాఫిక్ సమస్యలు తీర్చారు. అక్రమ మద్యం, గంజాయి అమ్మకాలు, పేకాట నిర్వాహకులు పోలీసుల చర్యలతో తోక ముడిచారు. దాబాల్లో మద్యం తాగకుండా చర్యలు తీసుకున్నారు. కళాశాలలు, ఉన్నత పాఠశాల వద్ద కొందరు ఆకతాయిల తీరుతో ఇంట్లో చెప్పక లోలోన మదనపడుతుండేవారు. అలాంటి ఆకతాయిలు పోలీసు చర్యలతో కళాశాలలు, పాఠశాలల సమీపంలోకి కూడా వెళ్లడం లేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో రాత్రి పొద్దుపోయే వరకు ఆకతాయిలు ప్రధాన రహదారులతోపాటు వీధుల్లోనూ అల్లరి చేస్తూ ప్రజలకు తలనొప్పిగా మారారు. ఇపుడు రాత్రి 10 గంటల తర్వాత రహదారులపై అనవసరంగా తిరిగే ఆకతాయిల బెడద తగ్గిపోయింది. పోలీస్‌స్టేషన్‌లో గతంలో చాలా వరకు పంచాయితీలతో కిటకిటలాడేది. ఇప్పుడు పోలీస్‌స్టేషన్ వద్ద అలాంటి వాతావరణం కనిపించడం లేదు. ఎవరైనా తనకు అన్యాయం జరిగిందని స్టేషన్‌కు వెళ్తే వారి సమస్యపై తక్షణం స్పందించి పోలీసులు చర్యలు చేపడుతున్నారు. గతంలో అన్యాయం జరిగిందని స్టేషన్‌కు వెళ్తే కొన్నిసార్లు వారిపై రాజకీయ ఒత్తిడితో తిరిగి కేసులు పెట్టిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. గతంలో కొందరు పోలీసులు పంచాయితీల పేరిట చేతివాటం ప్రదర్శించి విధులకంటే నిధులకే ప్రాధాన్యం ఇచ్చేవారు. ఇపుడు అలాంటి పరిస్థితి పూర్తిగా మారింది. రాత్రి వేళల్లోనూ శివారు కాలనీలతోపాటు పట్టణంలోనూ పోలీసు గస్తీ పెరిగింది. పోలీసుల చర్యలతో స్వల్ప కాలంలోనే పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొనడంపై పురప్రజలు పోలీసుల పని తీరును మెచ్చుకుంటున్నారు.



గతంలో వేధింపులు ఇలా..

☛ పట్టణంలో ఓ కోళ్ల వ్యాపారి కోళ్లను మిగతావారి కంటే తక్కువ ధరకు అమ్ముతున్నారని రాజకీయ అండతో ఆయనతోపాటు కుమారుడిపై ఏకంగా హత్యాయత్నం కేసు నమోదు చేశారు. తండ్రీకొడుకులిద్దరినీ జైలుకు పంపారు.

☛ పట్టణంలో డీఎస్పీ బంగ్లాకు సమీపంలోని కాలనీలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఇది అప్పట్లో అధికారం అండతో పెద్దగా బయటకు రాలేదు. తర్వాత నిర్వాహకులు షరామామూలుగా పేకాట స్థావరాన్ని నిర్వహించారు. ఆడేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూడా పదుల సంఖ్యలో జూదరులు వచ్చి వెళ్తున్నా చూసీచూడనట్లుగా వ్యవహరించడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వెలువడ్డాయి.

☛ ఎమ్మిగనూరులో ప్రముఖ కంపెనీ కొబ్బరినూనెను పోలినట్లుగా నకిలీవి విక్రయిస్తూ ఓ వ్యాపారి పట్టుబడ్డారు. దీన్ని అధికారం అండతో నీరుగార్చారు.

☛ పట్టణంలో స్థలాలు, ఇతర భూముల ఆక్రమణలో కబ్జాదారులు చెలరేగిపోయారు. వారి దౌర్జన్యానికి ఓ కుటుంబం పురుగుల మందు తాగడం అప్పట్లో సంచలనం సృష్టించింది.

☛ పట్టణంలో స్థలం పంచాయితీలు, ఇతర సమస్యలను రాజకీయం అండగా చోటా నాయకులు బృందాలుగా జోక్యం చేసుకునేవారు. వినకుంటే దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేసేవారు. బాధితులు స్టేషన్‌కు వెళ్లినా రాజకీయ ఒత్తిళ్లతో పట్టించుకునేవారు కాదు.

శ్రీమఠం పీఠాధిపతికి పుష్పాభిషేకం



పీఠాధిపతికి పుష్పాలతో అభిషేకం చేస్తున్న సంస్థ ఛైర్మన్

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఐడీఏఆర్సీ అంతర్జాతీయ రాఘవేంద్ర స్వామి మఠాల నిర్వహణ సంస్థ ఛైర్మన్ పాండ్యన్, కార్యదర్శి గిరిజ ఆధ్వర్యంలో తమిళనాడు భక్తులు శుక్రవారం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులకు తులాభారం, పుష్పాభిషేకం నిర్వహించారు. సుమారు 2 వేల మంది తమిళ భక్తులు రాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి విశేష పూజలు చేశారు. శ్రీమఠం సంప్రదాయం ప్రకారం కార్తిక మాసాన్ని పురస్కరించుకుని భక్తులు దీపాలు వెలిగించారు. ఉత్సవమూర్తి ప్రహ్లాద రాయలను ఊరేగించారు.

అమ్మవారికి తాళిబొట్ల బహూకరణ



తాళిబొట్లు అందజేస్తున్న దాతలు

కె.నాగలాపురం (గూడూరు), న్యూస్‌టుడే: మండలంలోని కె.నాగలాపురం సుంకులమ్మ అమ్మవారికి తడకనపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు దంపతులు శుక్రవారం రెండు తాళిబొట్లు బహూకరించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. అంతకుముందు దాతలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న జేసీ నవ్య

ఓర్వకల్లు న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న భూ రీసర్వే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ నవ్య అన్నారు. తిప్పాయపల్లెలో శుక్రవారం నిర్వహించిన సభలో పలువురు తమ సమస్యలను జేసీ దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వం రీసర్వే పేరుతో తమ భూములు విస్తీర్ణం తక్కువగా చూపించిందని విన్నవించారు. స్పందించిన జేసీ మాట్లాడుతూ న్యాయం జరిగేలా అన్నిరకాల చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు విద్యాసాగర్, ఏడీ సుబ్బారెడ్డి, మండల సర్వేయర్ శంకర్, వీఆర్‌వో జనార్దన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వలేదని దాడి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: పాతబస్తీకి చెందిన మండ్ల అనే వ్యక్తిపై దాడి జరిగింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇతను ఓ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి దుకాణం మూసి వెళ్తుండగా ఎర్రబురుజుకు చెందిన చెందు మరో ఇద్దరు కలిసి అడ్డుకుని డబ్బులు డిమాండ్ చేశారు. లేవని చెప్పటంతో దాడి చేశారు. బాధితుడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ : **సమస్య:** ముజఫర్‌నగర్, ప్రకాష్‌నగర్‌లో కుక్కల బెడద అధికంగా ఉంది. మనుషులపై దాడి చేస్తున్నాయి. – స్థానికులు
సమస్య: వెంకటరమణ కాలనీలోని వీధుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. – సుధాకర్
సమాధానం: సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం. – నగరపాలక సంస్థ అధికారులు

జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలి



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ విన్నవించారు. ఆయన శుక్రవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. హంద్రీనీవా నుంచి ఓర్వకల్లుకు తాగునీరు సరఫరా జరిగేలా చూడాలని కోరారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు.

21 మండలాల్లో వర్షపాతం నమోదు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు 21 మండలాల్లో వర్షం కురిసింది. కర్నూలు అర్బన్‌లో 16.8 మి.మీ. పడింది. మద్దికెర 16.0, హొళగుంద 15.2, కల్లూరు 11.8, చిప్పగిరి 10.4, ఆదోని 9.6, కర్నూలు రూరల్ 8.8 మి.మీ. నమోదైంది. జిల్లా సగటున 4.8 మి.మీ. పడింది. ఈనెల సాధారణ వర్షపాతం 110.2 మి.మీ. కాగా ఇప్పటి వరకు 71.0 మి.మీ. పడింది.

ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ.4,219

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం వివిధ పంట ఉత్పత్తులు వచ్చాయి. 5,046 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ.667, మధ్యస్థ ధర రూ.3,968, గరిష్ఠ ధర రూ.4,219 పలికింది. వేరుశనగకాయలు క్వింటా గరిష్ఠ ధర రూ.6,629, పూల విత్తనాలు రూ.5,430, ఆముదాలు రూ.6,129, వాము రూ.21,180, మొక్కజొన్న రూ.2,279, కందులు రూ.7,100, శనగలు రూ.6,309కు వ్యాపారులు కొనుగోలు చేశారు.

బిల్లులు పెట్టి.. నిధులు మింగి

◆ రూ.లక్షల్లో దోపిడీ
◆ అక్రమాలకు పాల్పడుతున్నా చర్యలు శూన్యమే



కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగరపాలకసంస్థలో సి.బిల్లులను ఇష్టానుసారంగా పెట్టేస్తున్నారు. రూ.లక్షలు దోచేస్తున్నారు. ఇటీవల కాలంలో రూ.లక్షల్లో సి.బిల్లులు పెట్టి భారీగా దోపిడీకి పాల్పడారన్న ఆరోపణలున్నాయి. ఓ సీనియర్ అధికారి బదిలీ అయ్యే క్రమంలో సి.బిల్లులపై ఆయన చేత సంతకాలు చేయించి నగరపాలక నిధులను దారి మళ్లించడం చర్చనీయాంశంగా మారింది.

ఒక సమావేశం.. రూ.40 వేలు ఖర్చు

☛ నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్, సభ్యులతోపాటు అధికారులు ఉంటారు. అందరూ కలిపితే సుమారు 30 వరకు ఉండొచ్చు. వారికి స్నాక్స్, టీ ఖర్చులు కలిపి ఒక్కొక్కరికి రూ.300 లెక్కన.. సరాసరిన రూ.10 వేల వరకు ఖర్చవుతుంది. కానీ స్టాండింగ్ కమిటీ సమావేశం కోసం చేసిన ఖర్చుకుగానూ సి.బిల్లు రూపంలో రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెడుతున్నట్లు సమాచారం.

పక్కదారి పడుతున్నా..

☛ నగరపాలక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తే ఆ పేరుతో రూ.2 లక్షలకు పైగా సి.బిల్లుల రూపంలో దండుకుంటున్నారని తెలిసింది. అసలు ఆ సమావేశంలో కేవలం స్నాక్స్, టీ, నీళ్లు మాత్రమే ఇస్తున్నారు. కొన్ని సందర్భాల్లో భోజనం పెట్టినట్లు బిల్లులు చేసుకున్నారని సమాచారం. సమావేశానికయ్యే ఖర్చు వివరాలు ఇవ్వాలంటూ గతంలో ఓ కార్పొరేటర్ అడిగినా అధికారులు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

☛ కార్యాలయ నిర్వహణ, సమావేశాలు, చిన్నపాటి సమావేశాలు నిర్వహించినా రూ.వేలల్లో బిల్లులు పెడుతున్నారు. వాహనాలు, కంప్యూటర్లకు సంబంధించి మరమ్మతులు, ఇతరత్రా వాటికి సంబంధించి సి.బిల్లులు పెడుతున్నారు.

☛ నగరపాలక ఆధ్వర్యంలో నగరంలో ఏదైనా అధికారిక కార్యక్రమం నిర్వహించిన సందర్భంలోనూ రూ.లక్షల్లో సి.బిల్లులు పెడుతుండటం గమనార్హం.

బదిలీపై వెళ్లినా..

కర్నూలు నగరపాలకలో అసలు సి.బిల్లులు ఎన్ని పెడుతున్నారు.. ఎంత ఖర్చు చేస్తున్నారన్న అంశాలను కప్పిపుచ్చుతూ రూ.లక్షల్లో స్వాహా చేస్తున్నారు. ఇటీవల కాలంలోనే రూ.లక్షల్లో సి.బిల్లులు చేసుకున్నారని సమాచారం. ఓ సీనియర్ అధికారికి నగరపాలక బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత ఆయన బదిలీ అయ్యారు. బదిలీ అయిన నాలుగైదు రోజుల తర్వాత ఆయన చేత పాత తేదీలతో సి.బిల్లులపై సంతకాలు చేయించుకున్నట్లు సమాచారం. రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు బిల్లులు చేసుకున్నారని నగరపాలకలో చర్చనీయాంశంగా మారింది.

రూ.లక్ష దాటితే టెండరు ద్వారా పనులు అప్పగించాల్సి ఉంటుంది. అలా చేయకుండా విభజించి రూ.లక్ష లోపున తమకు నచ్చిన గుత్తేదారుడికి పని కేటాయించి అవినీతికి పాల్పడుతున్నారు. నిర్మాణ పనుల్లో ప్యాచ్ వర్కుల పేరుతో రూ.లక్ష వరకు సి.బిల్లు పెడుతూ నిధులు పక్కదారి పట్టిస్తున్నారు.

విచారణ జరిపితే..

నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో కొంత మంది అధికారులతో పాటు ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్ గుత్తేదారులతో కుమ్మక్కయ్యారు. గుత్తేదారులకు సహకరిస్తూ సి.బిల్లులు చేసుకున్నారు. ఇటీవల కాలంలోనే భారీగా నిధులను కాజేశారన్న విమర్శలున్నాయి. విచారణ చేపడితే వాస్తవాలు వెలుగుచూస్తాయని పలువురు పేర్కొంటున్నారు. గతంలో పనిచేసిన అధికారులు సైతం చూసీచూడనట్లు వదిలేశారు. ఇకనైనా స్పందించి నగరపాలక నిధులకు గండి పడకుండా చూడాల్సిన అవసరం ఉంది.

దళారులను బయటకు పంపండి

◆ రైతుబజారు విస్తరణకు చర్యలు

స్పందనకు వందనం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రైతుబజార్‌లో వినియోగదారులకు సరసమైన ధరలకు కూరగాయలు విక్రయించాలని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు అన్నారు. దళారుల రాజ్యం.. అక్రమాల పర్వం శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీనిపై జేడీ స్పందించారు. రైతుబజార్‌ను సందర్శించి ధరల పట్టికపై ఉన్న ధరలకే కూరగాయలను విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు కానివారుంటే బయటకు పంపాలని మార్కెటింగ్ శాఖ ఏడీ, ఎస్టేట్ ఆఫీసర్లను ఆదేశించారు. దళారులు పాగా వేస్తే చర్యలు తప్పవన్నారు. రైతుబజార్‌లో అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు పంపాలని ఏడీని ఆదేశించారు. రైతుబజార్ విస్తరణకు సంబంధించి కేటాయించిన పది క్వార్టర్స్ స్థలాన్ని జేడీ పరిశీలించారు. పనులు త్వరలో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ హరీష్ కుమార్ తదితరులు ఉన్నారు.



రైతుబజారును తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు

స్పందించకుంటే ఆందోళనకు దిగుతాం

కర్నూలు వైద్యాలయం,న్యూస్‌టుడే : ఎన్టీఆర్ వైద్యసేవల కింద వివిధ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో పనిచేసే ఆరోగ్యమిత్రలు, టీం లీడర్లు, కార్యాలయ సిబ్బంది తదితరుల సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 29 నుంచి సమ్మెలోకి వెళతామని ఎన్టీఆర్ వైద్యసేవల ఉద్యోగు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీప్రసన్న, రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వారు శుక్రవారం మాట్లాడుతూ ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని తెలిపారు. వెంటనే సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు.

సంక్షిప్త సమాచారం

నాయకల్లు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: కల్లూరు మండల పరిధి నాయకల్లు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.వై.నాగప్రసాద్‌బాబు తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డా.శైలేష్‌కుమార్, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పందిపాడు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: కల్లూరు మండల పరిధిలో రీసర్వే పూర్తైన గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ గ్రామసభలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పందిపాడులో గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి పలు సమస్యల పరిష్కారం కోసం 40 దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దారు ఆంజనేయులు, మండల సర్వేయర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నటేకూరు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: చిన్నటేకూరు గ్రామంలో హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ కమిటీ ప్రతినిధులు శుక్రవారం సమావేశమయ్యారు. హంద్రీ నది పరిరక్షణకు తీసుకోవాల్సిన అంశాలపై వారు చర్చించారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలో రహదారుల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా నంద్యాల చెక్‌పోస్టు నుంచి నందికొట్కూరు రోడ్డులో ఉన్న ఎస్ఎస్ గార్డెన్‌తో పాటు మరో రెండు చోట్ల విస్తరణకు అడుగులు పడనున్నాయి. క్షేత్రస్థాయిలో ప్లానింగ్ కార్యదర్శులు సర్వే పనులు చేపట్టారు.

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: ఖోఖోను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని న్యాయవాది శ్రీధర్‌రెడ్డి అన్నారు. కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో ఎంపిక పోటీలను జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, ప్రభాకర్, నాగిరెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అన్నివిధాలా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రీడా సంఘం ప్రతినిధులు చిన్న సుంకన్న, ఖలీల్, సురేష్ నాయుడు, శేషు పాల్గొన్నారు.

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలకు చెందిన తెలుగు శాఖ అధ్యక్షురాలు డాక్టర్ ఎం.ఫరీదా బేగం ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో పాల్గొనేందుకు ఆహ్వానం వచ్చినట్లు ప్రిన్సిపల్ వీవీఎస్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఖతర్ రాజధాని దోహాలో నవంబర్ 22, 23వ తేదీల్లో ఆంధ్ర కళావేదిక, అమెరికా తెలుగు సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జరిగే సదస్సులో పాల్గొంటారని చెప్పారు.

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా ప్రజలు ఆరోగ్యం, క్రీడలకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎంఈవో విజయకుమారి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాలమేరకు స్వచ్ఛత ఫ్రీడమ్ రన్ 5.0ను డీఎస్‌ఏ స్టేడియంలో వారు జెండా ఊపి ప్రారంభించారు.

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ అన్నారు. జొహరాపురం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం తనిఖీ చేశారు.


కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: మార్కెట్ యార్డు మహిళా హమాలీ కార్మికులకు లైసెన్సులు ఇవ్వాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.నిర్మల, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ తదితరులు కోరారు. వారు శుక్రవారం మార్కెట్ కమిటీ కార్యదర్శి జయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందించారు.

చినుకు కురిసింది.. మురుగు నిలిచింది



నగరంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి బళ్లారి చౌరస్తాలో మురుగు నీరు పెద్దఎత్తున ప్రవహించింది. వర్షం నీరు మురుగులో కలిసిపోవడంతో జనం ఇబ్బందులు పడ్డారు. వర్షం కురిసినప్పుడల్లా ఇదే పరిస్థితి ఉంటోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు.
– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

ప్రతి వైద్య విద్యార్థికి శిక్షణ తప్పనిసరి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ, వైద్యులు, వైద్య విద్యార్థులు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ప్రతి వైద్యవిద్యార్థికి (బి.ఎల్.ఎస్.) బేసిక్ లైఫ్ సపోర్ట్ శిక్షణ నైపుణ్యం తప్పనిసరి అని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ అన్నారు. కర్నూలు సర్వజన వైద్యశాలలో అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ అత్యవసర విభాగంలో బేసిక్ లైఫ్ సపోర్ట్ శిక్షణ తీసుకోవడం ద్వారా ఎందరో విలువైన ప్రాణాలు కాపాడొచ్చని పేర్కొన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ విశాల, డాక్టర్ శ్రీలత, పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్ర, కార్డియాలజిస్టు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ సునియా బేగం తదితరులు పాల్గొన్నారు.

మోసాలకు పాల్పడితే చర్యలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర కుమార్ హెచ్చరించారు. 'దళారుల రాజ్యం.. అక్రమాల పర్వం' శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. కర్నూలు సి.క్యాంపు రైతుబజార్‌లో వ్యాపారుల తక్కెళ్లను తనిఖీ చేశారు. రాళ్ల తక్కెళ్ల స్థానంలో ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలతో కూరగాయలు అమ్మాలని ఆయన ఆదేశించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నగరంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో, కర్నూలు రూరల్ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల మధ్యలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి ఒక ప్రకటనలో తెలపారు. కర్నూలు డివిజన్‌లో డీ2 సెక్షన్ పరిధిలో గణేశ్ నగర్, మద్దూర్‌నగర్, రెవెన్యూ కాలనీ, సి.క్యాంపు ప్రాంతం, శ్రీరామనగర్, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ, చెక్‌పోస్టు ప్రాంతం, శ్రీరామ్‌నగర్, పోస్టల్‌కాలనీ, ధనలక్ష్మినగర్, కమలానగర్, టెలికాంనగర్, కల్లూరు, కల్లూరు ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రాజేందర్‌బాబు తెలిపారు. డీ1 సెక్షన్ పరిధిలోని కాలనీల్లోనూ విద్యుత్తు ఉండదని డీ1 సెక్షన్ ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. ప్రత్యామ్నాయ సరఫరా అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రూరల్ ప్రాంతంలో పంచలింగాల 33కేవీ ఫీడర్‌లో పనుల నేపథ్యంలో పంచలింగాల, గొందిపర్ల, ఇ.తాండ్రపాడు, దేవమాడ, పంచలింగాల, స్కంద తదితర ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏడీఈ సుబ్బన్న వివరించారు. వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించిన 3ఫేస్ సరఫరాను ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు, 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు అందించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, పారిశ్రామికవేత్తలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు జలమండలి, నందికొట్కూరు న్యూస్‌టుడే: హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ఒకటో డివిజన్ ఈఈగా జి.రాజన్‌బాబు శుక్రవారం నందికొట్కూరు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఇంజినీర్లు, కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు. చిన్ననీటిపారుదల శాఖ పరిధిలోని కర్నూలు ఎంఐ సబ్ డివిజన్ డీఈఈగా వై.నాగరాజు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. కేసీ కాలువ కర్నూలు సబ్ డివిజన్ డీఈఈ గా ఎన్.ప్రసాద్‌రావు బాధ్యతలు చేపట్టారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన డీపీవో తదితరులు

ఓర్వకల్లు న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డీపీవో భాస్కర్ అన్నారు. ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తాగునీటి సరఫరా, పంచాయతీ ఆస్తులు, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, శిక్షకులు మురళి, జయపరిమళ, ఎన్ఐఆర్డీ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వేతన సవరణపై ఉత్తర్వుల జారీ

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల్లో, సెమీ గవర్నమెంటు ఆర్గనైజేషన్లలో పనిచేసే కార్మికులకు చెల్లించే దినసరి వేతనాల్లో సవరణ చేసినట్లు కర్నూలు కార్మిక శాఖ ఉప కమిషనరు కె.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. సవరించిన వేతనాలను 1-04-2024 నుంచి కర్నూలు జిల్లా పరిధిలోని గ్రామాలు, పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థ పరిధిలో పనిచేసే ఎన్ఎంఆర్ కార్మికులకు వేతనాలు వర్తింపజేయాలని ఆయన ఉత్తర్వుల్లో సూచించారు.

హార్ట్ ఫౌండేషన్ అధ్యక్షుడిగా రామ్ శంకర్‌నాయక్

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : హార్ట్ ఫౌండేషన్ అధ్యక్షుడిగా విశ్రాంత కలెక్టర్ రామ్‌శంకర్ నాయక్ ఎన్నిక అయ్యారు. కర్నూలు ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా రామ్‌శంకర్ నాయక్ మాట్లాడుతూ హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో గుండె జబ్బులపై విస్తృత ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయంలో గొడవలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టినట్లు రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఈనెల 17న ఆర్‌యూలో జరిగిన ఘటనపై పోలీసుల సమక్షంలో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. వసతి గృహంలో ఉండే విద్యార్థులపై ప్రత్యేక నిఘా పెట్టాలని వసతిగృహ సంరక్షకుడు విశ్వనాథరెడ్డికి సూచించామన్నారు.

సాయిబాబా జీవితం స్ఫూరిదాయకం

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే : ప్రజల హక్కులను కాపాడేందుకు ప్రాణాలను లెక్కచేయక పోరాడిన ప్రొఫెసర్ సాయిబాబా జీవితం ఆదర్శనీయమని న్యాయవాదులు కొనియాడారు. స్థానిక జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రవిగువేరా, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్ ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జయరాజ్, మాదన్న, సబ్బయ్య, నాగేంద్రనాథ్ యాదవ్, చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యుడు రవిగువేరా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు సురేష్‌కుమార్ కోరారు. యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌పాటి అధ్యక్షత వహించారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుంటే అక్టోబరు 24వ తేదీన పెద్ద ఎత్తున విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. అనంతరం డీఈవో కార్యాలయ ఏడీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు జయరాజు, ఇబ్రహీం, సర్వేశ్వర్‌రెడ్డి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నేతలు

మధ్యాహ్న భోజనం తనిఖీ

కర్నూలు న్యాయవిభాగం, కర్నూలు విద్య, న్యూస్‌టుడే : జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాల్‌తో కలిసి కర్నూలులోని దామోదరం సంజీవయ్య మున్సిపల్ పాఠశాల, ఏపీజే అబ్దుల్‌కలాం మెమోరియల్ మున్సిపల్ హైస్కూలు, ఉర్దూ ఉన్నత బడి తదితర పాఠశాలలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకటశేషాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

ఆట.. విజయాల బాట

■ వివిధ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులు

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : నగరంలోని డీఎస్‌ఏ స్టేడియం, నగర ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల ఆర్చరీ, వాలీబాల్, నెట్‌బాల్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధమవుతున్నారు. అవసరమైన మెలకువలు నేర్చుకుంటున్నారు.



వాలీబాల్‌లో తలపడుతున్న బాలికలు

గురిపెడితే పతకమే

కర్నూలు ధర్మపేటకు చెందిన అపురూప్‌సాయి 8వ తరగతి చదువుతున్నాడు. గతేడాది కర్నూలు బి.క్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన అసోసియేషన్ జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో బంగారు పతకం అందుకున్నారు. అదే ఏడాది కర్నూలులో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 జిల్లాస్థాయి విలువిద్య ఎంపిక పోటీల్లో రాణించారు. ఈ ఏడాది అక్టోబరులో కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన అండర్-14 విలువిద్య ఎంపిక పోటీల్లో రాణించి బంగారు పతకం అందుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో రాణించడమే తన లక్ష్యమని అపురూప్‌సాయి చెప్పారు.



– అపురూప్‌సాయి

అడుగు పెడితే విజయమే

గూడూరు చెందిన ప్రవీణ్‌కుమార్ వాలీబాల్‌లో రాణిస్తున్నారు. అతను జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. 2022లో కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో విజయం సాధించారు. గతేడాది అరకులో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించారు. ఈ ఏడాది అక్టోబరులో కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 వాలీబాల్ ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నిత్యం సాధన చేస్తూ జట్టులో కీలకపాత్ర పోషించేలా కృషి చేస్తున్నట్లు ప్రవీణ్‌కుమార్ చెప్పారు.



– ప్రవీణ్‌కుమార్

జట్టులో కీలకంగా..

దేవనకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దస్తగిరి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో గతేడాది జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 వాలీబాల్ పోటీల్లో జట్టు మూడో స్థానం సాధించడంలో అతను కీలకపాత్ర పోషించారు. ఈ ఏడాది అక్టోబరులో కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పర్యవేక్షణలో నిత్యం శిక్షణ తీసుకుంటున్నట్లు దస్తగిరి చెప్పారు.



– దస్తగిరి

విద్యుత్తు ఛార్జీల భారం మోపితే సహించం



విద్యుత్తు భవన్ గేటు వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్తు ఛార్జీల భారాన్ని ప్రజలపై వేసే ఆలోచనను ప్రభుత్వం, విద్యుత్తు సంస్థలు మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. నగరంలోని విద్యుత్తు భవన్ ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.8,114 కోట్ల భారాన్ని ప్రజలపై వేసే ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఇప్పటికే గత ప్రభుత్వం విద్యుత్తు భారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఏపీఈఆర్‌సీ ఆన్‌లైన్‌లో తూతూమంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ చేసి విద్యుత్తు ఛార్జీల భారాన్ని ప్రజలపై వేసేందుకు సిద్ధమైందని ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల మాట్లాడారు. అనంతరం డీఈ (సాంకేతిక) ఓబులేసుకు వినతిపత్రం అందించారు. సీపీఎం జిల్లా నాయకులు పి.ఎస్.రాధాకృష్ణ, ఆనంద్‌బాబు, సాయిబాబా, సుధాకరప్ప, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ఈవోపై సస్పెన్షన్ వేటు

ఓర్వకల్లు న్యూస్‌టుడే: కాల్వబుగ్గ ఈవోగా గతంలో పనిచేసిన డీఆర్‌కేవీ ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేసినట్లు జిల్లా దేవాదాయ శాఖ ఉప కమిషనర్ సుధాకరరెడ్డి శుక్రవారం తెలిపారు. కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయానికి చెందిన నిధులను పక్కదారి పట్టించి అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు రావటంతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. విచారణలో భాగంగా రూ.1.30 కోట్ల మేర అవినీతికి పాల్పడినట్లు రుజువు కావటంతో ఉన్నతాధికారులకు నివేదికలు పంపగా సస్పెండ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు కోరారు. నగరపాలక కమిషనర్ రవీంద్రబాబును శుక్రవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులకు పరికరాల సమస్య ఉందని చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులకు ఎన్నికల భత్యం ఇప్పించాలన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. మునెప్ప, మద్దిలేటి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు